



Truth of News
RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | అన్నమయ్య జిల్లా | సంచిక : 295 | మంగళవారం 12 మే 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## పెట్రోల్, నూనె వాడకాన్ని తగ్గించండి

### - ప్రధాని నరేంద్ర మోడీ

హైదరాబాద్ - సూర్య వాస్తవం



దేశంలో నెలకొన్న ఆర్థిక అనిశ్చితి, సరఫరా గొలుసులో ఏర్పడిన అంతరాయాలను అధిగమిం చేందుకు ప్రజలు తమ జీవనశైలిని మార్చుకోవాలని ప్రధాని నరేంద్ర మోడీ కోరారు. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరగడాన్ని ప్రస్తావిస్తూ మోడీ ఈ వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చి ప్రధాని ప్రజలపై ఆంక్షలు విధించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన బహిరంగ సభలో మోడీ, విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేసేందుకు ఏడాది పాటు బంగారం కొనుగోళ్లు, విదేశీ ప్రయాణాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. విదేశీ మారకద్రవ్య నిల్వలపై ఒత్తిడిని తగ్గించేందుకు బంగారం కొనుగోళ్లను నియంత్రించుకోవాలని

- మిగతా 2లో..

## రాష్ట్రానికి నిధులివ్వండి

### - కేంద్ర మంత్రుల వద్ద పాత విజ్ఞప్తులే చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం



రాష్ట్రానికి వివిధ కేంద్ర ప్రాయోజిత పథకాలతో పాటు, గతంలో హామీ ఇచ్చిన మేరకు వివిధ పథకాలకు, ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటన సందర్భంగా సోమవారం ఆయన పలువురు కేంద్ర మంత్రులను కలిశారు. ఈ సందర్భంగా గతంలో వివిధ సందర్భాలలో చేసిన విజ్ఞప్తులనే మరోమారు చేశారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ తో సిఎం భేటీ అయ్యారు. అమిత్ షా, చంద్రబాబు మధ్య విభజన హామీల్లో పెండింగ్ అంశాలతో పాటు రాజకీయ అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా అమరావతిలో పలు కేంద్ర సంస్థలను ఏర్పాటు చేయాలని సిఎం కోరారు. సహకార శాఖ నుంచి మరింత సహకారంతో పాటు పోలవరం ప్రాజెక్టు నిధుల విడుదలలో జాప్యం లేకుండా చూడాలని కోరారు. అమరావతి పనుల పురోగతిని వివరించి నిధుల సహకారం పెంచాలని కోరారు. అనంతరం జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ తో సిఎం చంద్రబాబు భేటీ అయ్యారు. పోలవరం ప్రాజెక్టులో కీలకమైన అంశాలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

- మిగతా 2లో..

## అవి ప్రసంగాలు కావు.. వైఫల్యాలకు రుజువులు

### - లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం



పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో మోడీ దేశ ప్రజలకు చేసిన ఏడు విజ్ఞప్తులపై లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ సోమవారం ఎదురు దాడి చేశారు. ప్రధాని చేసిన విజ్ఞప్తులు ఆచరణ సాధ్యం కానివని ఆయన అన్నారు. ప్రధాని చేసేవి ప్రసంగాలు కావు.. వైఫల్యాలకు రుజువులుగా రాహుల్ అభివర్ణించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ పోస్టులో మోడీపై తీవ్రంగా విమర్శలు చేశారు. మోడీజీ నిన్న ప్రజలను త్యాగాలు చేయమని కోరారు. బంగారం కొనవద్దు.

- మిగతా 2లో..

## ముస్లింలు, మావోయిస్టులు ఈ దేశ పౌరులు కాదా?

- వారికి రాజ్యాంగ హక్కులు ఉండవా?
- బీజేపీ అంటే బ్రిటీష్ జనతా పార్టీ
- ఆపార్టీది విభజించు... పాలించు సిద్ధాంతమే
- భారత విదేశాంగ విధానంలో మోడీ సర్కార్ పూర్తి వైఫల్యం
- ఇప్పటికైనా అఖిలపక్ష సమావేశం నిర్వహించాలి
- రాజకీయ కక్షలు ఉండవు.. మాది పారదర్శక పాలనే..
- విచారణ ఆధారంగానే బండి సంజయ్ కుమారుడిపై చర్యలు
- సున్నిత అంశం అయినందునే మహిళా ఐపీఎస్‌తో విచారణ కమిటీ ఏర్పాటు
- మీడియాతో ఇష్టాగోష్టిలో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్ - సూర్య వాస్తవం

బీజేపీ అంటే బ్రిటిష్ జనతా పార్టీ అనీ, బ్రిటీష్ పాలకుల మాదిరిగానే విభజించు పాలించు సిద్ధాంతంతో ఆ పార్టీ పాలన సాగుతున్నదని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి విమర్శించారు. ముస్లింలు, మావోయిస్టులు ఈ దేశ పౌరులు కాదా వారికి హక్కులుండవా రాజ్యాంగం అన్ని మతాలు, కులాలు, ప్రజలందరికీ సమాన

- మిగతా 2లో..



## స్టాలిన్ ఇంటికి సీఎం విజయ్

### - ప్రాధాన్యత సంతరించుకున్న భేటీ
### - 13న అసెంబ్లీలో బలపరీక్ష

చెన్నై- సూర్య వాస్తవం

తమిళనాడు కొత్త సీఎం విజయ్ -- మాజీ సీఎం ఎంకే స్టాలిన్ తో భేటీ అయ్యారు. టీవీకే చీఫ్ సోమవారం డీఎంకే అధినేత నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక వచ్చిన

## భార్యకు గౌరవంగా జీవించే హక్కుంది

### - ఆమెను పశువులా చూడొద్దు
### - గృహహింస కేసులో సుప్రీం తీవ్ర వ్యాఖ్యలు

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం



భార్యను పశువులా చూడ కూడదని, ఆమెకు గౌరవంతో జీవించే హక్కు ఉందని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. గృహహింస కేసు విచారణ లో భాగంగా

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## దేశానికే ఆదర్శంగా తెలంగాణ విద్యావిధానం

- విద్యార్థులకు రూ.వెయ్యి కోట్లతో 9 రకాల వస్తువులతో ఎడ్యుకేషన్ కిట్
- నాణ్యత లేకుంటే ఆ కంపెనీలను బ్లాక్ లిస్టులో పెట్టి బొక్కలో వేస్తాం
- ఉత్తమ టీచర్లకు జూన్ 2న, డిసెంబర్ 9న సన్మానం
- ఏటా 500 మంది ఉపాధ్యాయులను విదేశాలకు పంపిస్తాం
- విద్యా వారోత్సవాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- క్యూర్ పరిధిలో రూ.1700 కోట్లతో విద్యాసంస్థల్లో మౌలిక వసతుల అభివృద్ధి



హైదరాబాద్ - సూర్య వాస్తవం

తెలంగాణ విద్యావిధానాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్ది ముందుకు సాగుదామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ప్రవేశపెట్టబోతున్నామని స్పష్టం చేశారు. టెన్త్ తర్వాత విద్యార్థులు డ్రాపౌట్ అవుతున్నారనీ, దాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని వివరించారు. సోమవారం హైదరాబాద్‌లోనీ ఎల్బీ స్టేడియంలో విద్యా వారోత్సవాలను సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించారు. అందులో భాగంగా ఔటర్ రింగ్ రోడ్ లోపల క్యూర్ పరిధిలోని విద్యా సంస్థల్లో రూ.1700 కోట్లతో మౌలిక వసతుల అభివృద్ధి ప్రణాళిక కార్యక్రమాన్ని

- మిగతా 3లో..




## రాష్ట్రంలో నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం

### - నేషనల్ టెక్నాలజీ డే సందర్భంగా సీఎం చంద్రబాబు

అమరావతి - సూర్య వాస్తవం

నూతన ఆవిష్కరణలకు అనుకూల వాతావరణాన్ని రాష్ట్రంలో పెంపొందిస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా భారత భవిష్యత్తును సాంకేతికత, ఆవిష్కరణల ద్వారా నిర్మిస్తున్న శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలు, యువతకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆయన సోమవారం శుభాకాంక్షలు తెలిపారు. నాలెడ్జ్, రీసెర్చ్, ఇన్నోవేషన్స్, హ్యూమన్ రిసోర్సెస్ వంటి అంశాలతో స్థిరమైన అభివృద్ధి సాధ్యమనే విషయాన్ని పోఖ్రాన్ విజయం నిత్యం గుర్తు చేస్తూ ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రం కూడా ఆ దిశగానే అడుగులు వేస్తోందన్నారు.

- మిగతా 2లో..

# పెట్రోల్, నూనె
# వాడకాన్ని తగ్గించండి

(మొదటిపేజీ తరువాయి)

ప్రధాని సూచించారు. విదేశీ ప్రయాణాలకు దూరంగా ఉండటం మంచిదని అభివర్ణించిన మోడీ, విదేశాల్లో జరిగే వివాహ వేడుకలను కూడా వదులుకోవాలని ప్రజలను కోరారు. ప్రభుత్వ ఆర్థిక విధానాల వైఫల్యం కారణంగా తలెత్తిన విదేశీ మారకద్రవ్య సంక్షోభ భారాన్ని సామాన్య పౌరులపై మోపడమే ఇందుకు నిదర్శనం. దేశంలో ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు కోవిడ్ కాలంలోని వర్క్-ఫ్రమ్-హోమ్ విధానం, ఆన్‌లైన్ సమావేశాలను తిరిగి ప్రారంభించాలని మోడీ అన్నారు. ప్రధానమంత్రి ప్రజా రవాణాపై ఆధారపడాలని, విద్యుత్ వాహనాలకు మారాలని పిలుపునిచ్చారు. అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం లేదా ఇంధన ధరలను తగ్గించడం గురించి ఆయన ఎలాంటి స్పష్టమైన హామీలు ఇవ్వలేదు. దిగుమతులను తగ్గించడానికి వంట నూనె వాడకాన్ని తగ్గించాలని ప్రధానమంత్రి ఒక వింత సూచన కూడా చేశారు. రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని కనీసం 50 శాతం తగ్గించి, సేంద్రియ వ్యవసాయానికి మారాలని కూడా ఆయన కోరారు. ఎరువుల సబ్సిడీలు ప్రభుత్వంపై భారీ ఆర్థిక భారం అనే పరోక్ష సూచనతో ఈ వ్యాఖ్య చేశారు. ప్రపంచ సవాళ్లు సరఫరా గొలుసును దెబ్బతీస్తున్నప్పటికీ, ప్రధానమంత్రి తన ముప్పై నిమిషాల ప్రసంగంలో దేశీయ మార్కెట్లో ధరల పెరుగుదలను అరికట్టడానికి లేదా రూపాయి విలువ క్షీణతను పరిష్కరించడానికి ఎలాంటి నిర్మాణాత్మక చర్యలు తీసుకోలేదు. పౌరులు బాధ్యతాయుతమైన జీవనశైలిని అలవర్చుకోవాల్సిన అవసరం గురించి మాట్లాడుతూనే, కార్పొరేట్ అనుకూల విధానాల వల్ల దేశం కుప్పకూలడంపై మోడీ మౌనం వహించారు.

# అవి ప్రసంగాలు కావు..
# వైఫల్యాలకు రుజువులు

(మొదటిపేజీ తరువాయి)

విదేశాలకు వెళ్లవద్దు. పెట్రోల్ తక్కువగా వాడండి. ఎరువులు, వంట నూనె వాడకాన్ని తగ్గించండి. మెట్రోలో ప్రయాణించండి. ఇంటి నుంచే పని చేయండి. ఇవి ప్రబోధాలు కావు -- ఇవి వైఫల్యానికి నిదర్శనాలు. మోడీ ప్రధానిగా ఉన్న ఈ 12 ఏళ్లలో దేశాన్ని ఎంతటి దుస్థితికి తీసుకువచ్చారంటే.. ప్రజలను ఏమి కొనాలి.. ఏమి కొనకూడదు, ఎక్కడికి వెళ్లాలి. ఎక్కడికి వెళ్లకూడదు అని ఆయన చెప్పాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రతిసారి వారు జవాబుదారీతనం నుండి తప్పించుకోవడానికి బాధ్యతను ప్రజలపైకి నెట్టేస్తారు. రాజీపడిన ప్రధాని ఇకపై దేశాన్ని పాలించడం సాధ్యం కాదు అని రాహుల్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. కాగా, ప్రధాని మోడీ ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఓ సభలో మాట్లాడుతూ.. ప్రజలను ఏడాదిపాటు బంగారం కొనొద్దు, ఇంటి నుంచే పనిచేయండి, ఎరువులు, వంట నూనెను తగ్గించండి. పెట్రోల్ డీజిల్ తక్కువగా వాడండి. విదేశాలకు వెళ్లొద్దు లాంటివి ప్రజలకు విజ్ఞప్తులు చేశారు. వీటిపై ఆర్థిక నిపుణులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇవి అసలు సాధ్యమేనా? అని ప్రశ్నిస్తున్నారు.

# స్టాలిన్ ఇంటికి సీఎం విజయ్

(మొదటిపేజీ తరువాయి)

విజయ్‌ను మాజీ సీఎం స్టాలిన్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. వారిరువురి మధ్య దేశ, రాష్ట్ర రాజకీయాలపై చర్చ జరిగినట్టు టీవీకే వర్గాలు తెలిపాయి. ఈ భేటీలో మాజీ ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ కూడా పాల్గొన్నారు. రాష్ట్ర ఖజానాను గత డీఎంకే ప్రభుత్వం ఖాళీ చేసిందని ఇప్పటికే విజయ్ ఆరోపించారు. దీనికి స్టాలిన్ కూడా బదులిచ్చారు. అప్పులు పరిమితికి లోబడే ఉన్నాయన్నారు. కోవిడ్ లాంటి విపత్తును ఎదుర్కొని, నిధులు ఇవ్వడంలో అడ్డంకులు సృష్టించిన బీజేపీని తట్టుకుని దీటుగా నిలబడ్డామని తెలిపారు. ఈ నేపథ్యంలో వీరిద్దరు సమావేశం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**13న బలపరీక్ష**

టీవీకే విజయ్ నేతృత్వంలో ఆదివారం తమిళనాడులో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. మే 13న ఈ ప్రభుత్వం అసెంబ్లీలో బలపరీక్ష ఎదుర్కోనుంది. మరోవైపు నేడు కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అనూహ్య సంఘటన చోటుచేసుకుంది. నిన్న మంత్రిగా ప్రమాణం చేసిన యువనేత కీర్తన.. నేడు ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేయలేకపోయారు. ఎలక్షన్ సర్టిఫికేట్‌ను తీసుకురాకపోవడమే అందుకు కారణం. తర్వాత వెనక్కి వెళ్లిన ఆమె దానిని తీసుకొచ్చి, సమర్పించడంతో ఎట్టకేలకు ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేశారు.

# భార్యకు గౌరవంగా
# జీవించే హక్కుంది

(మొదటిపేజీ తరువాయి)

ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. గృహహింస ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి ముందస్తు బెయిల్ కోసం వేసిన పిటిషన్‌పై విచారించిన అత్యున్నత న్యాయస్థానం ఆ పిటిషనర్ అభ్యర్థనను తోసిపుచ్చింది. నిందితుడు మద్యం మత్తులో ఆ మహిళపై దాడి చేశాడని బాధితురాలి తరపు న్యాయవాది కోర్టులో వాదనలు వినిపించారు. నేలపైకి తోయడంతో ఇటుక తగిలి ఆమె తలకు బలంగా గాయమైనట్టు, ఆ తర్వాత కర్రతో కూడా దాడి చేసినట్టు ఆరోపణలున్నాయి. మరోవైపు నిందితుడు మూడు వివాహాలు చేసుకోగా.. న్యాయస్థానాన్ని ఆశ్రయించిన బాధితురాలైన మొదటి భార్య వాదనలు విన్న న్యాయస్థానం.. "మీరు మీ భార్యను ఎందుకు కొట్టాలనుకున్నారు.. ఇలాగే వేధిస్తే.. ఆమె మిమ్మల్ని వదిలి వెళ్లిపోతుంది. రెగ్యులర్ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోండి" అంటూ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది.

# రాష్ట్రంలో నూతన
# ఆవిష్కరణలకు ప్రోత్సాహం

(మొదటిపేజీ తరువాయి)

సాంకేతిక రంగాల్లో బలమైన ఎకోసిస్టమ్‌ను భవిష్యత్తులో నిర్మిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఐబిఎం స్కిల్ బిల్డ్, ఎపిఎస్‌సిహెచ్‌ఇ, ఎపిఎస్ఎస్‌డిసి, అమరావతి క్వాంటమ్ వ్యాలీతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా భారీ స్థాయి డీప్-టెక్ స్కిల్లింగ్ శిక్షణ కార్యక్రమాన్ని చేపడుతున్నామని ప్రకటించారు. టెక్నాలజీ ఎకోసిస్టమ్‌ను మరింత బలోపేతం చేసేలా నాగార్జున యూనివర్శిటీలో ఎన్ఐఇఎల్ఐటి ఇన్నోవేషన్ అండ్ స్కిల్లింగ్ సెంటర్ కీలక పాత్ర పోషించనుందని వెల్లడించారు. క్వాంటమ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ కమ్యూనికేషన్, సెమీకండక్టర్ టెక్నాలజీలపై ఈ కేంద్రం ప్రత్యేక దృష్టి సారించనుందని పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరంలోనే కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా(ఎన్‌పిటిఇఎల్) జాతీయ పరీక్షల్లో 4 బంగారు పతకాలు, 14 రజత పతకాలు సాధించిన రాష్ట్ర విద్యార్థులను అభినందించారు. రాష్ట్రంలోని ప్రతిభ, కృషి, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక ఎకోసిస్టమ్‌కు ఈ విజయాలే నిదర్శనమన్నారు.

# రాష్ట్రానికి నిధులివ్వండి

(మొదటిపేజీ తరువాయి)

2027 గోదావరి పుష్కరాల్లోపు పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు. తాను స్వయంగా ఐదుసార్లు ప్రాజెక్టును సందర్శించి పనుల పురోగతిని సమీక్షించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. 2026 ఏప్రిల్ 2 నాటికి కొత్త డయాఫ్రంవాల్ నిర్మాణం పూర్తయిందని, గ్యాప్ 1, గ్యాప్ 2లలో కీలకమైన ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయని తెలిపారు.

ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ప్రజాభిప్రాయ సేకరణ పెండింగ్‌లో ఉందనే కారణంతో 2011లో ఇచ్చిన స్టాప్ వర్క్ ఆర్డర్ ఉత్తర్వులను శాశ్వతంగా ఉపసంహరించుకోవాలని కోరారు. దీనివల్ల పోలవరం ప్రాజెక్టు పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా వేగంగా చేపట్టేందుకు వీలవుతుందని తెలిపారు. ప్రధానమంత్రి కృషి సించాయి యోజన కింద రాష్ట్రంలో వివిధ పథకాల పునరుద్ధరణ, ఆధునీకరణకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. 'హర్ ఖేత్ కో పానీ' కార్యక్రమంలో భాగంగా చెరువులు, కుంటల మరమ్మతులు, పునరుద్ధరణ, ఆధునికీకరణ, కాలువల పూడికతీత, గట్ల బలోపేతం లాంటి పనులు చేయాల్సి ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 297 నీటి వనరుల పునరుద్ధరణ కోసం రూ.285 కోట్ల నిధులను విడుదల చేయాలని కోరారు.

**ఆలమట్టి ఎత్తు పెంపుపై గెజిట్ విడుదల చేయొద్దు**

సుప్రీంకోర్టు తుది తీర్పు వచ్చేంత వరకూ ఆలమట్టి ఎత్తు పెంచే అంశంపై గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయొద్దని విజ్ఞప్తి చేశారు. ఆనకట్ట ఎత్తును 519.60 మీటర్ల నుంచి 524.256 మీటర్లకు పెంచితే రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందని, కనుక ఎలాంటి సాంకేతిక, పాలనా పరమైన అనుమతులు మంజూరు చేయొద్దని సూచించారు. అప్పర్ కృష్ణా ప్రాజెక్ట్ ఫేజ్-III కింద భూసేకరణ ఇతర సన్నాహక పనులు చేయకుండా కర్ణాటకను ఆదేశించాలని, సుప్రీంకోర్టు తుది తీర్పు వచ్చేంత వరకూ యథాతథ స్థితిని కొనసాగించాలని కోరారు. అదే విధంగా రాయలసీమ, దక్షిణ కోస్తాంధ్ర ప్రాంతాల దాహార్తిని తీర్చే పోలవరం -- బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేయాలని కోరారు.

**సవాళ్లను అవకాశాలుగా మలుచుకోవాలి : సిఐఐ సదస్సులో సిఎం**

అనంతరం సిఐఐ వార్షిక సదస్సులో చంద్రబాబు మాట్లాడుతూ సంక్షోభం నుంచి వచ్చిన సవాళ్లను అవకాశాలుగా మలుచుకోవాలని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ, పారిశ్రామిక పురోగతిలో సిఐఐది కీలక పాత్ర అని పేర్కొన్నారు.

ప్రభుత్వాలు ఎకో సిస్టమ్ ను మాత్రమే తీసుకొస్తాయని, ఇన్నోవేటర్లు (ఆవిష్కర్తలు), పారిశ్రామికవేత్తల దీర్ఘకాల ఆర్థిక పరిపుష్టికి దోహదం చేస్తారని తెలిపారు. తనకు జాతీయ, రాష్ట్ర అజెండాలు ఉన్నాయని, వాటిని పారిశ్రామిక వేత్తలు ప్రోత్సహిస్తారన్న నమ్మకం తనకు ఉందని అన్నారు. వినూత్న ఆలోచనలతో లక్ష్యాలు చేరుకోవచ్చని వివరించారు. 1990 నాటి ఆర్థిక సంస్కరణల ఫలితాలను ఇప్పుడు చూస్తున్నామని చెప్పుకొచ్చారు.

# ముస్లింలు, మావోయిస్టులు
# ఈ దేశ పౌరులు కాదా?

(మొదటిపేజీ తరువాయి)

హక్కులిచ్చిన విషయాన్ని మరిచారా వారిపై ఎందుకింత విద్వేషాలు రెచ్చగొడుతున్నారు అని ప్రశ్నించారు. ముస్లింలపైనా, మావోయిస్టుల పైనా ప్రధాని వ్యాఖ్యలు సరిగాదన్నారు. అబ్దుల్ కలాం, జాకీర్ హుస్సేన్ ముస్లింలు కాదా వారు దేశ అభివృద్ధిలో పాలుపంచు కోలేదా అని నిలదీశారు. ఏ ప్రధాని అయినా దేశ ప్రజలందరూ ఐకమత్యంగా కలిసుండాలని కోరుకుంటారనీ, ప్రధాని మోడీ మాత్రం ముస్లింలను వేరుచేసి చూడటం ఏంటని ప్రశ్నించారు. కమ్యూనిజం గొప్ప ఫిలాసఫీ అనీ, అది అంటరానిది ఎలా అవుతుందని ప్రశ్నించారు. పేదలకు భూములు పంచాలనీ, కూలిరేట్లు పెంచాలనీ, అందరికీ ఇండ్లు కట్టివ్వాలని కమ్యూనిస్టులు పోరాటాలు చేస్తే ఆచరణలో భూములు పంచింది, కూలిరేట్లు పెంచింది, ఇండ్లు కట్టిస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వాలేనని గుర్తుచేశారు. బీజేపీ సిద్ధాంతాన్ని కాదనే వాళ్లను ఖతం చేసే పనిలో మోడీ సర్కారు ఉందని విమర్శించారు. దేశం కోసం ప్రాణాలు ఇచ్చిన పార్టీ తమదనీ, ప్రాణాల విలువ ఏంటో తమకు తెలుసన్నారు. మావోయిస్టులు బుల్లెట్ అంటే కాదు బ్యాలెట్ అని మేం అన్నామనీ, చివరకు మావోయిస్టులను బ్యాలెట్ లైన్‌లోకే తెచ్చామని చెప్పారు. ఆయుధాలు అప్పగించి మావోయిస్టులు లొంగిపోవడం పెద్ద అచీవ్ మెంట్ అనీ, ఈ విషయంలో తెలంగాణ పోలీసులను, రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రధాని అభినందించాల్సి ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. గణపతి కూడా ప్రజాస్రవంతిలోకి రావాలని కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. తాను అందరివాడిననీ, రాజకీయ కక్ష?లకు పాల్పడ కుండా పారదర్శక పాలన అందించడమే తన లక్ష్యమని అన్నారు. కేసుల విషయంలో విచారణ అధికారం ప్రభుత్వానిదనీ, శిక్షించే అధికారం కోర్టులదని తెలిపారు. తాను ప్రధాని మోడీతో ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్నాననీ, ఆ కార్యక్రమంలో ప్రధాని మాటలకు రాజకీయాలు ఆపాదించవద్దని కోరారు. మెట్రో, సదరన్ పార్టు రీజనల్ రింగురోడ్డు, తుమ్మిడిహట్టి, ఇలా కొన్ని పెండింగ్ అభివృద్ధి పనులను సింగిల్ విండో విధానం తీసుకొచ్చి పరిష్కరించాలని ప్రధాని మోడీని కోరగా...తమతో కలిసి వస్తే మరింత అభివృద్ధి సాధ్యమని చెప్పారనీ, ఆ కార్యక్రమంలో రాజకీయ చర్చలకు తావు లేదని స్పష్టం చేశారు.

యూపీఏ హయాంలో అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ గుజరాత్ ప్రభుత్వానికి(మోడీ సర్కారుకు) అభివృద్ధి విషయంలో సహకరించినట్టుగానే తెలంగాణ అభివృద్ధి విషయంలో ఆయన్ను స్పిరిట్‌గా తీసుకుని సహకరించాలని ప్రస్తుత ప్రధాని మోడీని కోరానని తెలిపారు. గత ప్రభుత్వం కేంద్రం నుంచి నిధులను రాబట్టడంలోనూ, డీపీఆర్‌లు ఇవ్వడం, సంప్రదింపులు జరపడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఆర్ఆర్ఆర్, కాకతీయ మెగా టెక్స్‌టైల్స్, ఎయిర్‌పోర్టుల క్లియర్, డిఫెన్స్ ల్యాండ్, ఏడీబీ నిధులు, నేషనల్ హైవేలను కేంద్రంతో మాట్లాడి తమ ప్రభుత్వం క్లియరెన్స్ తెస్తున్నదని తెలిపారు. తెలంగాణకు కేంద్రం నుంచి సహకారం అందీ అందనట్టుగానే ఉందన్నారు. యూరియా ఇవ్వాల్సింది కేంద్ర ప్రభుత్వమనీ, రాష్ట్ర ప్రభుత్వంపై బీజేపీ నేతలు తప్పుడు ప్రచారం చేయడమేంటని నిలదీశారు.

**మోడీ ప్రభుత్వ విదేశాంగ విధానం వైఫల్యం**

'బంగారం కొనొద్దు, విమానాల్లో ప్రయాణించొద్దు, పెట్రోల్ వాడకం తగ్గించండి' అని ప్రధాని మోడీ చెప్పడం అంటే విదేశాంగ విధానంలో ఆయన పూర్తిగా విఫలమైనట్టేనని సీఎం అన్నారు. ఆయన తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ఇలా మాట్లాడారని విమర్శించారు. ఆయన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యమన్నారు. రాహుల్ గాంధీ మొదటి నుంచి అదే చెబుతున్నారని చెప్పారు. అన్నిపార్టీలను పిలిచి విదేశాంగ విధానంపై చర్చించాలనీ, ప్రతిపక్ష?ల సలహాలు తీసుకుని ముందుకెళ్లాలని సూచించారు. ఎన్నికల ముందు ఆయా రాష్ట్రాలకు ప్యాకేజీలు ప్రకటించడం... అవి అయిపోగానే టెంట్ చాపలా చుట్టుకుని వెళ్లిపోవడం...చూస్తుంటే బీజేపీ పాలన అచ్చం జెమినీ సర్కస్‌లా ఉందని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు.

**2029లో జమిలి ఎన్నికలు**

కొత్తగా కాంగ్రెస్ పార్టీ కేరళలో గెలిచిందన్నారు. బీజేపీ బెంగాల్‌లో గెలిచిందనీ, కేరళలో మూడు, తమిళనాడులో ఒక సీటును సంపాదించిందని చెప్పారు. తమ పార్టీకి తమిళనాడులో ఐదు, బెంగాల్‌లో రెండు సీట్లు వచ్చాయని సీఎం తెలిపారు. సర్ లేకపోతే బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం రాకపోయేదన్నారు. ఆ పార్టీకి సర్ ఒక ఆయుధంగా మారిందని విమర్శించారు. తర్వాతి టార్గెట్ తెలంగాణ అని ప్రధాని మోడీ అనటంపై స్పందిస్తూ..జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఆ పార్టీకి డిపాజిట్ రాలేదని గుర్తుచేశారు. మున్సిపాలిటీల్లో బీజేపీ పరిస్థితి ఏమిటి? అనేది అందరికీ తెలుసునన్నారు. జమిలి ఎన్నికలు 2029లో పెట్టడానికి అవకాశం ఉందన్నారు. నియోజవర్గాల పునర్విభజన అంశంపై మాట్లాడుతూ..ఈశాన్య రాష్ట్రాల్లో జనాభా ప్రాతిపదిక ఎక్కడ ఉందని ప్రశ్నించారు. 50 శాతం జనాభాప్రాతిపదికన, 50 శాతం ఆర్థికాభివృద్ధి అంశాల వారీగా ఉండాలని తాను చెప్పడం కొత్తేం కాదన్నారు. మహిళా రిజర్వేషన్లు, జమిలీ ఎన్నికలు, సీట్ల పెంపు, డీలిమిటేషన్ అన్నింటినీ కలిపి బిల్లుగా పెట్టడం వల్లనే వ్యతిరేకించాల్సి వచ్చిందన్నారు. దామాషా ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన చేయొచ్చుగదా? రోజుకు నాలుగు జిల్లాల వివరాలు, ప్రజల అభిప్రాయాలు సేకరిస్తే 150 రోజుల్లో పూర్తి అవుతుంది కదా? అని ప్రశ్నించారు. కేంద్రం చెప్పినట్టు నియోజకవర్గాల సంఖ్య పెంచితే కొన్ని ప్రాంతాల ఉనికికి ప్రమాదం ఏర్పడుతుంది కాబట్టే ఒక విధానం రూపొందించాలని అడుగుతున్నామని చెప్పారు. తమిళనాడులో అతిపెద్ద పార్టీ అయిన టీవీకేను ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ పిలవకపోవడాన్ని తప్పుబట్టారు. కాంగ్రెస్ జపం లేకుండా బీజేపీ బతకలేదన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై ఫోక్సో కేసు నమోదు చేయడంపై డీజీపీ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నామనీ, మహిళా ఐపీఎస్ అధికారితో విచారణ కమిటీ వేసి బాధిత కుటుంబంతో వివరాలను రికార్డు చేయించాలని ఆదేశించామని తెలిపారు. ప్రధాని పర్యటనలో భద్రత నిమిత్తం 10 వేల మంది పోలీసులు ఉండటంతో కేసు విచారణ కొంత ఆలస్యమైందన్నారు. తమ ప్రభుత్వం ఎవ్వరినీ వదలనీ, విచారణ ప్రకారమే చర్యలు ఉంటాయని తెలిపారు. సెన్సిటివ్ అంశం కావడంతో పోలీసులు జాగ్రత్తగా హ్యాండిల్ చేస్తున్నారని చెప్పారు. 30 ఏండ్లు పోలీసు అధికారిగా పనిచేసిన ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ ఈ కేసు విషయంలో ఇష్టానుసారంగా మాట్లాడటం సరిగాదన్నారు. తన ఫోన్ ట్యాపింగ్ గురైందని ఆరోపించిన ప్రవీణ్‌కుమార్‌నే విచారణ సమయంలో ప్రభాకర్‌రావు మంచోడు అన్నట్టు స్టేట్‌మెంట్ ఇవ్వడాన్ని బట్టే ఆయన తీరేంటో అర్థం అవుతుందన్నారు. బీ.ఆర్.ఎస్ పాలనలో విద్యావ్యవస్థ ఆగమైందని మొత్తుకున్న ఆర్.ఎస్.పీ ఇప్పుడు కేసీఆర్‌కు దొరరత్న అవార్డు ఇచ్చే పనిలో ఉన్నారని దెప్పిపొడిచారు. భగీరథ్ పై కేసు విషయంలో ఆధారాలుంటే పోలీసులకు ఇవ్వాలని ప్రవీణ్‌కుమార్‌కు సూచించారు. హ్యామ్ రోడ్లపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఖండించారు. విద్యావారంలో భాగంగా డ్రగ్స్‌కు వ్యతిరేకంగా యాంటీ డ్రగ్ మూవ్‌మెంట్ కార్యక్రమం ఎల్‌బీ స్టేడియంలో చేయబోతున్నట్టు ప్రకటించారు. ప్రయివేటు విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ అంశం తన దృష్టిలో ఉందనీ, ఒక విధానపరమైన నిర్ణయం ద్వారా ముందుకెళ్తామని స్పష్టం చేశారు. తుమ్మిడిహట్టిపై సహకరించాలని మహారాష్ట్ర సీఎం, ప్రధాని మోడీలకు లేఖలు రాశామని తెలిపారు. ఈ విషయంలో ప్రధాని పెద్దరికం పాత్ర పోషించాలని కోరారు.

# దేశానికే ఆదర్శంగా తెలంగాణ విద్యావిధానం

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూవిద్యాసంస్థలు, యూనివర్సిటీలు విద్యను నిర్లక్ష్యం చేస్తే తెలంగాణ సమాజం బలహీనపడుతుందని వివరించారు. పేదలకు న్యాయమైన విద్య, సాంకేతిక నైపుణ్యాన్ని అందించడం ప్రభుత్వ బాధ్యత అని చెప్పారు. రాష్ట్రంలోని తండాలు, గూడేలు, మారుముల గ్రామాల్లోని పేదలు, దళితులు, గిరిజనులకు నాణ్యమైన విద్యను అందించాలని విద్యాశాఖను తన దగ్గర ఉంచుకున్నానని అన్నారు. 27 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 19 లక్షల విద్యార్థులు చదువుకుంటున్నారని చెప్పారు. 1.5 లక్షల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని చెప్పారు. 12 వేల ప్రయివేటు స్కూళ్లలో 38 లక్షల మంది చదువుతున్నారని వివరించారు. ప్రయివేట్ స్కూళ్లలో ఉన్న గొప్పతనం ఏమిటీ, ప్రభుత్వ స్కూళ్లలో ఉన్న లోపం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్ర బడ్జెట్లో విద్యాశాఖకు ఎనిమిది శాతం నిధులను కేటాయించామన్నారు. దశల వారీగా విద్యకు 15 శాతం నిధులను కేటాయించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రభుత్వ విద్యలో తెలంగాణను దేశంలోనే నెంబర్ వన్ గా నిలబట్టడమే లక్ష్యమని ప్రకటించారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఉందని అన్నారు. 25 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులను విద్యా విధానం పరిశీలనకు ఫిన్లాండ్‌కు పంపించామని వివరించారు. అత్యుత్తమ ప్రదర్శన కనపర్చిన ఉపాధ్యాయులను ఎంపిక చేసి 500 మందిని విదేశాలకు పంపిస్తామన్నారు. విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను గుర్తించే టీచర్లను అభినందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని అన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ రెండున, తెలంగాణ తల్లి జన్మదినం డిసెంబర్ తొమ్మిదిన ఉత్తమ టీచర్లకు సన్మానం చేస్తామని వివరించారు. పేద విద్యార్థులు ఆర్థాకలితో పాఠశాలలకు వస్తున్నారనీ, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందిస్తామని చెప్పారు. పాఠశాల విద్యార్థులకు పాలు, రాగిజావ అందిస్తామన్నారు. కొడంగల్‌లో పైలట్ ప్రాజెక్టుగా పాఠశాలల్లో బ్రేక్ ఫాస్ట్ అద్భుతంగా అందిస్తున్నామని అన్నారు.

ప్రభుత్వం పాఠశాల్లో చదవే విద్యార్థులు తమ పిల్లలతో సమానమని చెప్పారు. తల్లిదండ్రుల్లా తమ ప్రభుత్వం విద్యార్థులను జాగ్రత్తగా చూసుకుంటుందని వివరించారు. విద్యాశాఖపైన పెట్టే ఖర్చును భవిష్యత్తు తరాల పెట్టుబడిగా భావిస్తున్నామని చెప్పారు. 100 నియోజకవర్గాల్లో 100 యంగ్ ఇండియా ఇంటిగ్రేటేడ్ స్కూళ్లను రూ.200 కోట్లతో నిర్మిస్తున్నామని వివరించారు. పేద బిడ్డలు ధైర్యంగా వాటిలో చదువుకున్నామని చెప్పాలన్నదే తన ధ్యేయమని చెప్పారు.

## సంపాదకీయం

# నియోజకవర్గాల పెంపు ఎవరికి లాభం.. ఎవరికి నష్టం

ఉమ్మడి ఏపీలో 2014 వరకు 294 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. 42 లోక్ సభ స్థానాలు ఉన్నాయి. రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి 175 స్థానాలు.. తెలంగాణకు 119 స్థానాలు వెళ్లాయి. అదే సమయంలో లోక్ సభ స్థానాల అంశాన్నే తీసుకుంటే.. ఏపీకి 25 స్థానాలు.. తెలంగాణకు 17 స్థానాలు కేటాయించారు. విభజన చట్టంలో రెండు తెలుగు రాష్ట్రాల అసెంబ్లీ సీట్ల సంఖ్యను పెంచుతామని చెప్పారు. ఈ లెక్కన ఏపీ అసెంబ్లీలో ఉన్న 175 స్థానాలకు 225 స్థానాలు పెరగాలి. తెలంగాణలో.. ప్రస్తుతం 119 అసెంబ్లీ స్థానాలు 150కు పెరుగుతాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభాలో ఏపీ రాష్ట్ర వాటా 4.08 శాతం. ఆ నిష్పత్తి ప్రకారం ఏపీకి వచ్చే లోక్ సభ స్థానాలు 33 మాత్రమే.తెలుగు రాష్ట్రాల్లో పెరిగే సీట్లు ఎక్కడ పెరుగుతాయి..? తగ్గే సీట్లు ఎక్కడ తగ్గుతాయనేది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ఉన్న సమాచారం ప్రకారం.. జనాభా ఎక్కువగా ఉన్న పెద్ద నగరాల్లో సీట్లు పెరిగి.. గ్రామీణ ప్రాంతాల్లో తగ్గొచ్చనేది అంచనా. అలా జరిగితే.. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి చుట్టుపక్కలే ఎక్కువ సీట్లు పెరిగే అవకాశం ఉంది. ఎందుకంటే తెలంగాణ జనాభా 3.60 కోట్లు కాగా.. జీహెచ్ఎంసీ జనాభానే కోటి పైగా ఉంది. కాబట్టి ఇక్కడ సీట్లు పెంచక తప్పదు. గతంలో పునర్విభజన జరిగినప్పుడు కూడా హైదరాబాద్‌లో సీట్లు పెరిగిన సంగతిని సీనియర్లు గుర్తుచేసుకుంటున్నారు..ఏతావాతా రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ నగర ప్రాంతాల్లో సీట్లు పెరిగి.. గ్రామీణ ప్రాంతాల్లో సీట్లు తగ్గుతాయనేది ప్రముఖంగా వినిపిస్తున్న మాట. అలా జరిగితే అర్బన్ ప్రాంతాల్లో పట్టున్న పార్టీలకు, నేతలకు అడ్వాంటేజ్ ఉంటుందనే వాదన వినిపిస్తోంది. తద్వారా గ్రామీణ ఓటర్ల కంటే అర్బన్ ఓటర్లను ఆకట్టుకోవటానికి పార్టీలు, నేతలు ఎక్కువ ప్రయత్నాలు చేస్తారనడంలో సందేహం అక్కర్లేదనే అభిప్రాయాలు వస్తున్నాయి. ఈ పరిణామాల్ని దృష్టిలో పెట్టుకుని ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో పార్టీలన్నీ తమ బలాబలాలు, ట్రాక్ రికార్డ్, ఓట్ల శాతం, పట్టున్న ప్రాంతాల లెక్కలు తీసే పనిలో పడ్డాయి. దాన్ని బట్టి భవిష్యత్ రాజకీయ వ్యూహం ఖరారు చేసుకునే పనిలో పడొచ్చని నేతలు భావిస్తున్నారు. పార్టీలకు మాత్రం స్వతహాగా మహిళల్లో అనుకూలత లేదు. కొన్నింటికైతే తమ తప్పు లేకుండానే ప్రత్యర్థుల చాతుర్యం కారణంగా మహిళా వ్యతిరేకులనే ముద్ర పడిపోయింది. ఇప్పటికిప్పుడు ఆ ముద్ర చెరిపేసుకోవడం కుదురుతుందా అనేది కొత్త టెన్షన్. ప్రస్తుతం మహిళా రిజర్వేషన్లు అమలు కాకుండానే.. ఎన్నికల్లో గెలుపోటములకు మహిళా ఓట్లే కీలకంగా మారుతున్నాయి. ఇటీవలే జరిగిన బీహార్ ఎన్నికల్లో నారీశక్తి ఘనంగా పనిచేసింది.2029 ఎన్నికల నాటికి ఈ సంఖ్య కనీసం 9కి చేరనుంది. గత ఎన్నికల్లో ప్రధాన పార్టీలు మహిళలకు తక్కువ టికెట్లు కేటాయించినప్పటికీ.. భవిష్యత్తులో ప్రతి పార్టీ కచ్చితంగా 9 మంది మహిళా అభ్యర్థులను బరిలోకి దించాల్సి ఉంటుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం ఖమ్మం, కరీంనగర్ వంటి జిల్లాల్లో మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. ఈ మార్పులు మహిళల గొంతు పార్లమెంటులో మరింత బలంగా వినిపించడానికి దోహదపడతాయని అంటున్నారు. నియోజకవర్గాల పునర్విభజనలో అసెంబ్లీ నియోజకవర్గాల సరిహద్దుల ఆధారంగా లోక్‌సభ స్థానాలను పునర్విభజించాలన్న నిబంధన పెట్టారు. ఈ లెక్కన ముందు అసెంబ్లీ నియోజకవర్గాలను ఏర్పాటు చేస్తారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా చేస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 27,41,239 మంది జనాభా ఉన్నారు. ప్రాథమికంగా అందుతున్న సమాచారం, జరుగుతున్న ప్రచారం మేరకు ప్రతి 2లక్షల జనాభాకు ఒక సీటు పెరిగే అవకాశం ఉంది. ఇక లోక్‌సభ స్థానాలు 17 నుంచి 26 లేదా 27 అయ్యే అవకాశాలున్నాయి. జనాభా లెక్కల ఆధారంగా ఏర్పాటు చేస్తే అత్యధిక జనాభా ఉన్న హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలోనే ఎక్కువ ఎంపీ సీట్లు పెరుగుతాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రస్తుతం 10 అసెంబ్లీ స్థానాలు, పునర్విభజన అనంతరం 14 లేదా 15 అయ్యే అకాశాలున్నాయి. వీటిలో 33 శాతం కనిష్ఠంగా 4 నుంచి గరిష్ఠంగా 5 స్థానాలు మహిళలకు కేటాయిస్తారు. ఎస్సీ, ఎస్టీ స్థానాలను కలుపుకొనే మహిళల రిజర్వేషన్ కల్పిస్తారు. అంటే రిజర్వేషన్ పురుషులు, మహిళలు అని మారుతూ ఉంటుంది. దీంతో రాజకీయంగా కొత్త వారికి అవకాశాలు వస్తాయి. పురుషులతోపాటు మహిళలు అవకాశాలు అందిపుచ్చుకొనే వీలు ఉంటుంది. ఇక కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ వచ్చే ఎన్నికల నాటికి అధికారాన్ని అందుకోవాలని తెగతాపత్రయపడుతోంది. ఇలాంటి సమయంలో నియోజకవర్గాల పునర్విభజనను అనుకూలంగా మార్చుకోవాలని కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీగా వ్యవహరించే పరిస్థితి కనిపిస్తోందని అంటున్నారు. కానీ రాష్ట్రంలో తమకు ఉన్న సంస్థాగత బలం.. ఉపయోగపడుతుందనేది బీఆర్ఎస్ లెక్కగా ఉంది. తెలంగాణలో ప్రస్తుతం 17 పార్లమెంటు నియోజకవర్గాలు ఉండగా, కాంగ్రెస్, బీజేపీ 2024 ఎన్నికల్లో ఎనిమిది స్థానాలు చొప్పున గెలుచుకున్నాయి. 1971 జనాభా లెక్కల ప్రకారం 1972లో నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. ఆ తర్వాత? నియోజకవర్గాల సంఖ్య పెరగలేదు. కానీ? కొన్ని పరిధులు, పేర్ల మార్పుతో 2009లో ఎన్నికలు జరిగాయి. జనాభా గణన అనంతరం విధిగా జరిగే నియోజకవర్గాల పునర్విభజన ఒక వ్యక్తి, ఒక ఓటు, ఒకే విలువ అన్న సూత్రం ప్రాతిపదికన జరగాలని రాజ్యాంగ నిబంధన పేర్కొంది. కానీ ఇప్పుడు కేంద్రం మాత్రం 2011లో చేసిన జనగణన ఆధారంగా డీలిమిటేషన్‌కు రెడీ అయింది. లోక్‌సభకు ఎన్నికయ్యే ప్రతి సభ్యుడు ప్రాతినిధ్యం వహించే ఓటర్ల సంఖ్య సమానంగా ఉండి తీరాలని ..ఒక వ్యక్తి, ఒక ఓటు, ఒకే విలువ అనే ప్రజాస్వామిక సూత్రం నిర్దేశిస్తుంది. ఈ సూత్రం ఉల్లంఘనకు గురైతే పెద్ద నియోజకవర్గాలలోని ఓటు విలువ చిన్న నియోజకవర్గాలలోని ఓటు విలువ కంటే తక్కువగా ఉంటుంది. ఈ సూత్రాన్ని ఏ మేరకు ఫాలో అవుతారనేది చూడాల్సి ఉంది. ప్రస్తుతానికి 50 శాతం సీట్ల పెంపు అని చెబుతున్నా.. సమాన ఓటు విలువ విషయంలో తేడాలొస్తాయేమోననే సందేహాలు లేకపోలేదు. జనాభాకు, లోక్‌సభ సభ్యుల సంఖ్యకు గల నిష్పత్తి సాధ్యమైనంతవరకు అన్ని రాష్ట్రాలకు ఒకేవిధంగా ఉండాలి. ఏతావాతా ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగకుండా.. ప్రజా ప్రాతినిధ్యానికి ఇబ్బంది లేకుండా డీలిమిటేషన్ చేయాలనేదే రాజ్యాంగం సూత్రీకరణ. దేశంలో గతంలో జరిగిన పునర్విభజన ప్రక్రియలు కూడా ఇదే విషయం చెబుతున్నాయి. మరి ఇప్పుడు జరిగే డీలిమిటేషన్ ఎలా జరుగుతుందోనని ఏపీతో పాటు అన్ని రాష్ట్రాలూ ఉత్కంఠగా ఎదురుచూస్తున్నాయి.



# ఏపీలోకి టీవీకేపార్టీ.. కాంగ్రెస్‌తో పొత్తు




**తిరుపతి-సూర్య వాస్తవం :**

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ టీవీకే పార్టీ ప్రభంజనం సృష్టించింది.. సింగిల్ లార్జెస్ట్ పార్టీగా నిలిచింది. టీవీకేతో కలిసొచ్చే పార్టీలతో కలిసి విజయ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయంగా కనిపిస్తోంది. సినిమాలతో అభిమానులతో మొదలైన విజయ్ ప్రస్థానం.. ఎన్నికల గెలుపు వరకు సాగింది. తమిళనాడులో పార్టీ ప్రారంభించిన రెండేళ్లలోనే తిరుగులేని విజయం సాధించడంతో టీవీకేలో కొత్త జోష్ నింపింది. విజయ్ ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాల్లో ఓ ట్రెండ్ సెట్టర్‌గా మారారనే చెప్పాలి.. టీవీకే విజయం దేశవ్యాప్తంగా రాజకీయ వర్గాల్లో కొత్త చర్చకు దారి తీసింది.తమిళనాడులో టీవీకే విజయం తర్వాత.. విజయ్ నెక్స్ట్ ప్లాన్ ఏంటి.. దళపతి తమిళనాడుతో ఆగుతారా పొరుగున ఉన్న రాష్ట్రాల్లోకి ఎంట్రీ ఇస్తారా అనే చర్చ మొదలైంది. ముఖ్యంగా విజయ్ కన్ను ఆంధ్రప్రదేశ్‌పై పడిందనే ఊహాగానాలు మొదలయ్యాయి.. టీవీకే అధినేత తమిళనాడు సరిహద్దులో ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో పార్టీని విస్తరించే అవకాశం ఉందంటున్నారు. తమిళనాడు ఎన్నికలకు ముందు నుంచే ఆంధ్రప్రదేశ్ టీవీకే పార్టీ పేరుతో కొందరు సోషల్ మీడియాలో పేజీలు కూడా నడపుతుండటంతో టాక్ మొదలైంది. విజయ్ ముందు తమిళనాడులో స్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుని.. ఆ తర్వాత ఇతర రాష్ట్రాలకు టీవీకే పార్టీని విస్తరిస్తారనే ఊహాగానాలు మొదలయ్యాయి. విజయ్ ఆంధ్రప్రదేశ్‌వైపు రావడానికి కారణాలు చాలానే ఉన్నాయి. తమిళనాడులో విజయ్‌కు యువత నుంచి మంచి ఆదరణ వచ్చింది.. దళితులు, క్రిస్టియన్లు మద్దతు తెలిపారు. ఇక్కడ కూడా అడుగుపెట్టి ఆయా సామాజిక వర్గాల మద్దతు కూడగట్టే అవకాశం ఉందంటున్నారు. ఏపీలో ముఖ్యంగా తీరప్రాంత జిల్లాలతో పాటుగా యువత, క్రిస్టియన్లు, దళిత ఓటర్లను ఆకట్టుకుంటే బలమైన రాజకీయశక్తిగా ఎదగొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే తమిళనాడుతో పోలిస్తే ఏపీలో క్రిస్టియన్ల సంఖ్య ఎక్కువగా ఉండటం కూడా కలిసొస్తుందంటు న్నారు. తమిళనాడు ఫార్ములాను ఫాలో అవుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ప్రస్తుతం ఉన్న పార్టీలకు ప్రత్యామ్నాయంగా ఎంట్రీ ఇచ్చే అవకాశాలు లేకపోలేదంటున్నారు. టీవీకే పార్టీని విస్తరించేందుకు ఆంధ్రప్రదేశ్ మంచి ఆప్షన్ అనే వాదనలు వినిపిస్తున్నాయి. అలాగే తెలుగు ఇండస్ట్రీ నుంచి, ఇతర రాజకీయ పార్టీల నుంచి వచ్చేవారిని ఏకం చేస్తే ఇంకా ప్లస్ అవుతుందంటున్నారు.అంతేకాదు విజయ్ టీవీకే పార్టీ ఏపీలో కాంగ్రెస్‌తో జతకట్టి ఎన్నికలకు వెళ్లే అవకాశాలు లేకపోలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ తమిళనాడు సరిహద్దుతో పాటుగా మరికొన్ని చోట్ల టీవీకే అభ్యర్థులకు అవకాశం ఇచ్చి కూటమిగా బరిలోకి దిగే అవకాశాలు కొట్టిపారేయలేం అంటున్నారు. ఏపీ సరిహద్దులోని కొన్ని జిల్లాలపై తమిళనాడు ప్రభావం ఉంటుంది.. మిగిలిన చోట్ల బలపడాలంటే కష్టంగా ఉంటుంది. అందుకే ఏపీలో కాంగ్రెస్‌తో కలిసి ముందుకు సాగితే సక్సెస్ కావొచ్చు అంటున్నారు.

### యానాంలో ఘోర ఓటమి

యానాంలో విజయ్ టీవీకే అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయనే దానిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. యానాం నియోజకవర్గం కాకినాడ, బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల మధ్యలో ఉంది. ఈ నియోజకవర్గంలో తెలుగు ప్రజలు ఎక్కువ. రాజకీయంగా వారి ప్రభావం కూడా ఎక్కువే. తెలుగు ప్రజలు ఎక్కువగా ఉన్న యానాం నియోజకవర్గంలోని ఓటర్లు విజయ్ టీవీకేకు ఘోర పరాభవాన్ని రుచి చూపించారు. టీవీకే అభ్యర్థి తోట రాజు కేవలం 167 ఓట్లు మాత్రమే సాధించి డిపాజిట్ కూడా పోగొట్టుకున్నారు. టీవీకే అభ్యర్థి కంటే.. నోటాకు 193 ఓట్లు పడటం విశేషం. దీంతో తెలుగు ప్రజలు విజయ్‌కు దిమ్మతిరిగే షాక్ ఇచ్చారంటూ సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. మరోవైపు యానాం అసెంబ్లీ నియోజకవర్గంలో 37,972 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 35,445 మంది అంటే 93.35 శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో ఎన్నార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన మల్లాడి కృష్ణారావు విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే అయిన గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌పై మల్లాడి కృష్ణారావు 4,568 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఎమ్మెల్యేగా మల్లాడి కృష్ణారావు ఆరోసారి విజయం సాధించారు. మరోవైపు పుదుచ్చేరిలో ఎన్డీఏ కూటమి విజయానికి హామీలు కూడా ప్రధాన కారణమనే విశ్లేషణలు వినిపిస్తు న్నాయి.

మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు, మంచినీటి ఏటీఎంలు, అటల్ క్యాంటీన్లు, బాలికలకు ఈ-స్కూటర్లు, స్థానికులకే ఉద్యోగ రిజర్వేషన్లు వంటి హామీలు ఓటర్లను ఆకర్షించాయి. మత్స్యకారులను వెనుకబడిన జాబితాలో చేరుస్తామని ప్రకటించడం కూడా కలిసి వచ్చింది. విజయ్ టీవీకే పార్టీ కూడా ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చటం ఎన్డీఏ కూటమికి కలిసి వచ్చింది.

# హస్తం లక్ష్యం ... ఆ ముగ్గురే...





**కరీంనగర్ -సూర్య వాస్తవం :**

పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్.. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ... ఇక బీఆరఎస్ సోషల్ విడియా కన్వీనర్‌గా మన్నె క్రిశాంక్..వీళ్లు ముగ్గురు సోషల్ విడియా యాంటి సర్కార్ పోస్టులతో హోరెత్తిస్తున్నారు. దీంతో ఆ ముగ్గురు టార్గెట్‌గా అధికార కాంగ్రెస్ కూడా అన్నింటికీ రెడీ అయిపోయింది. బీఆరఎస్‌లోని ట్రిపుల్ కే పైనే అధికార పార్టీ సీరియస్ ఫోకస్ పెట్టిందా? అందుకే కేసులు, అరెస్టుల దాకా వ్యవహారం వెళ్తుందా?రాజకీయ విశ్లేషణ తెలంగాణలో టార్గెట్ పాలిటిక్స్ ట్రెండింగ్‌గా మారాయి. అధికార కాంగ్రెస్..ప్రతిపక్ష నేతల విమర్శలను, ఆరోపణలను తిప్పికొట్టడంలో పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తోంది. బీఆరఎస్ పార్టీ నుంచి పెరుగుతున్న రాజకీయ దాడిని హస్తం పార్టీ వ్యూహాత్మకంగా తిప్పికొట్టే ప్లాన్ చేస్తోంది. ఈ క్రమంలో బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, యువ నాయకుడు మన్నె క్రిశాంక్‌లను కంట్రోల్ చేసేందుకు అధికార పార్టీ పక్కా స్కెచ్ వేసి ముందుకు పోతోంది.ఈ మధ్య కాంగ్రెస్ సర్కార్‌పై పబ్లిక్ విటింగ్‌లు, సభలు, సమావేశాల్లో కేటీఆర్ అటాకింగ్ డోస్ పెంచారు. ఇష్యూ ఏదైనా..సబ్జెక్ట్ మరేదైనా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై గళమెత్తుతున్నారు కేటీఆర్. వరంగల్ రైతు సంగ్రామ సదస్సులో రేవంత్‌పై, అధికార పార్టీపై కాస్త గట్టిగానే అటాక్ చేశారు. 420 హామిలు, ఆరు గ్యారెంటీలు అట్టర్ ఫ్లాప్ అంటూ ప్రజాక్షేత్రంలో పవర్ ఫుల్ వాయిస్ వినిపించారు. సభలు, సమావేశాలతో ఎన్నికల మడ్ లోకి వెళ్లిపోయిన బీఆరఎస్..ఇప్పటి నుంచి ఇక పూర్తిస్థాయిలో జనంలో ఉండేలా రూట్ మ్యాప్ రెడీ చేసుకుని గ్రౌండ్‌లోకి దిగుతోంది. ఇందులో భాగంగా ఆరు గ్యారంటీలు అటకెక్కాయంటూ..కాంగ్రెస్ సభలు పెట్టిన చోటే కౌంటర్ విటింగ్స్ పెడుతూ కేటీఆర్ విమర్శల దాడిని పెంచుతూ వస్తున్నారు.సీఎం రేవంత్ రెడ్డి నుంచి మొదలు మంత్రులపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీకి కేటీఆర్ కొరకరాని కొయ్యగా మారడంతో..వ్యక్తిగత విమర్శలు, ఆరోపణలతో తమ నేత క్యారెక్టర్‌ను దెబ్బతీసే కుట్ర చేస్తున్నారని అంటోంది బీఆరఎస్. ఈ-కార్ రేస్, ఫోన్ ట్యాపింగ్ విచారణ వంటివి కేటీఆర్ ను కార్నర్ చేసే కుట్రలో భాగమేనంటున్నాయి బీఆరఎస్ వర్గాలు.ఇక హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి..అధికార కాంగ్రెస్‌పై అటాకింగ్‌కు ఏ మాత్రం వెనకాడట్లేదు.



అసెంబ్లీ లోపల, బయట రేవంత్ సర్కార్‌పై దూకుడుగా విమర్శలు చేస్తున్నారు.

స్థానిక సమస్యల నుంచి రాష్ట్ర రాజకీయాల వరకు తనదైన స్టైల్లో రెస్పాండ్ అవుతూ లైమ్‌లైట్‌లో ఉంటున్నారు. ఈ మధ్య కౌశిక్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై, అధికారులపై చేస్తున్న వ్యాఖ్యలు, విమర్శలు రాజకీయ దుమారానికి దారితీస్తున్నాయి. ముఖ్యమంత్రి నుంచి మొదలు, మంత్రులు, అధికారులపై కౌశిక్ రెడ్డి సంచలన ఆరోపణలు చేయడం చర్చనీ యాంశమవుతోంది.ఈ క్రమంలోనే కౌశిక్ రెడ్డి అధికార కాంగ్రెస్ పార్టీకి టార్గెట్ అయిపోయారని బీఆరఎస్ నేతలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికే పలు కేసులు కౌశిక్ పై నమోదుకాగా..తాజాగా కరీంనగర్ దాడి బీజేపీ చేసినా?దానికి కాంగ్రెస్ సహకారం ఉందంటూ మండిపడుతున్నారు బీఆరఎస్ నేతలు. ఇవన్నీ కౌశిక్‌ను సైలెంట్ చేసే ప్రయత్నాలే అంటున్నారు గులాబీ లీడర్లు. గత అసెంబ్లీ సెషన్‌లో కౌశిక్ రెడ్డి శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలన్న అంశాన్ని ఎథిక్స్ కమిటీకి సిఫారసు చేశారంటే ఏ రేంజ్‌లో టార్గెట్ చేశారో అర్థం చేసుకోవచ్చంటున్నారు బీఆరఎస్ నేతలు. మరోవైపు సోషల్ విడియా వేదికగా కాంగ్రెస్ సర్కార్‌పై పదునైన విమర్శలు, స్కామ్‌లు అంటూ ఆరోపణలు చేస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మన్నె క్రిశాంక్‌పై వరుస కేసులు నమోదు అవుతున్నాయి. ఎక్స్ వేదికగా తన వాయిస్‌ను బలంగా వినిపిస్తున్న క్రిశాంక్..ప్రభుత్వంలో ఇంటర్నల్‌గా జరుగుతున్న అవినీతి వ్యవహారాలపై సోషల్ విడియా వేదికగా ప్రశ్నిస్తున్నారు. దీంతో క్రిశాంక్ కూడా అధికార కాంగ్రెస్‌కు కంట్లో నలుసులా మారారని.. అందుకే ఆయన్ను టార్గెట్ చేసి మరీ ఒక కేసు అయిపోక ముందే మరో కేసులో కోర్టులు, జైళ్ల చుట్టూ తిప్పుతున్నారని మండిపడుతోంది బీఆరఎస్. సంబంధం లేని సెక్షన్ల కింద కేసులు పెట్టి జైలుకు పంపించారని అంటున్నారు.తమ పార్టీ తరఫున గట్టిగా మాట్లాడుతున్న నేతలను కాంగ్రెస్ కావాలనే టార్గెట్ చేస్తోందనేది గులాబీ పార్టీ వాదన. ఇలా బీఆరఎస్‌లో ట్రిపుల్ కే చుట్టూ కాంగ్రెస్ పార్టీ, పోలీసులు చక్కర్లు కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గట్టిగా మాట్లాడే నేతలను ఇప్పటి నుంచే కంట్రోల్ చేయకపోతే..ఎన్నికల నాటికి మరింత చెలరేగి పోతారనేది సర్కార్ ఆలోచనగా కనిపిస్తోంది. దీనిని బీఆరఎస్ ఎలా ఎదుర్కొంటుందో చూడాలి.

# వీరాంజనేయ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి



**వేంపల్లె – సూర్య వాస్తవం :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండి క్షేత్రంలో అత్యంత వైభవంగా జరుగుతున్న శ్రీ వీరాంజనేయస్వామి వారి కుంభాభిషేక మహోత్సవాల సందర్భంగా, ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ పవిత్ర పర్వదినాన ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్సీకి ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆ పవనపుత్రుడి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించారు. భక్తులకు అసౌకర్యం కలగకూడ అధికారులకు సూచన తెలియజేశారు. దర్శనానంతరం ఎమ్మెల్సీ ఆలయ అధికారులతో మాట్లాడి, కుంభాభిషేక మహోత్సవ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ మహోత్సవానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. తాగునీరు, క్యూలైన్ల నిర్వహణ మరియు ఇతర కనీస సౌకర్యాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఎమ్మెల్సీ తో పాటు పలువురు నేతలు, ప్రముఖులు పాల్గొన్నారు. వీరిలో మాజీ ఎంపీటీసీ జీవి.రమణ, ఏమిరెడ్డి కృష్ణ రెడ్డి, డీవీ.సుబ్బారెడ్డి, గిడంగిపల్లి భాస్కర్ రెడ్డి, ఆర్వి రమేష్, పోతిరెడ్డి శివ, జనసేన నాయకులు డా.హరీష్, నాగులగుట్ట పల్లి ఆంజనేయులు, నరసింహా రెడ్డి, శివ రెడ్డి, భాను కిరణ్, మహేష్, చైతన్య, జనసేన నాయకులు మల్లి, సుధీర్ రెడ్డి తదితరులు పాల్గొని స్వామివారిని సేవించుకున్నారు.

# ప్రజలే నాకు దేవుళ్ళు

## - వారి మధ్యనే పుట్టినరోజు వేడుకలు

## జరుపుకుంటానన్న మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి

**తాడిపత్రి – సూర్య వాస్తవం :**



ప్రజలే తన దేవుళ్లని, వారి మధ్యే తన పుట్టిన రోజును ఈనెల 25న వినూత్నరీతి లో జరుపుకుంటానని మాజీ ఎమ్మెల్యే జే సీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. తన నివాసంలో విలేకరుల సమా వేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గత పుట్టినరోజులను సాధారణంగా దివ్యాంగు ల మధ్య జరుపుకొనే వాడినని తెలిపారు. అయితే ప్రజలే నా దేవుళ్లు అని తాను ఎప్పుడూ చెబుతుండే మాటను అనుసరిం చి, ఈ యేడు పుట్టిన రోజును ప్రత్యేకంగా పోలీస్‌స్టేషన సర్కిల్‌లో గాంధీ విగ్రహం వద్ద ఆ దేవుళ్ల మధ్యనే జరుపుకోవాలని నిర్ణయించు కున్నానని తెలిపారు. తన పుట్టినరోజుకు ఒక ప్రత్యేకత ఉండాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అలాగే వినూత్నరీతిలో జరపాలని నిశ్చయించుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు మూడు ప్రశ్నలు ఇచ్చి, సమాధానాలు ఇలా అడుగుతున్నారు.

1. నా పుట్టినరోజు ఎలా చేసుకుంటే బాగుంటుంది తెలియజేయాలి.
2. 2. సమాజంలో మహిళల పాత్ర ఎలా ఉంది? వారి బాధ్యత ఎలా నెరవేరుస్తున్నారు?
2. 3. ప్రస్తుతం సమాజంలో విద్యార్థుల ఎలా ఉంటున్నారు?

ఈ మూడు ప్రశ్నలపై ఈనెల 17లోగా ప్రజలు సమాధానాలు ఇవ్వాల న్నారు. ఇందుకోసం పట్టణంలోని లలిత మెగామాల్, వద్దిషోరూం, బిగ్‌సి సెల్‌పాయింట్ తాడిపత్రి ఈవెంట్‌తోపాటు పలు చోట్ల బాక్సులు ఏర్పాటు చేశామని తెలిపారు. మీ సమాధానాలు రాసి ఆ బాక్స్‌లో వేయాలని ఆయన ప్రజలను కోరారు.

# నూతన అగ్నిమాపక వాహనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జె.సి.అష్మిత్ రెడ్డి

**తాడిపత్రి – సూర్య వాస్తవం :** స్థానిక పట్టణ ప్రజల భద్రత కోసం అగ్నిమాపక శాఖకు మరో బలం చేకూరింది. పట్టణంలోని సంజీవ్ నగర్లో ఉన్న ఫైర్ స్టేషన్ కార్యాలయంలో, స్థానిక శాసనసభ్యులు జె.సి. అష్మిత్ రెడ్డి నూతనంగా మంజూరైన అగ్నిమాపక వాహనాన్ని రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ప్రజా భద్రతే మాకు ముఖ్యం అగ్ని ప్రమాదాల సమయంలో త్వరితగతిన స్పందించి ఆస్తి, ప్రాణ నష్టాలను తగ్గించడానికి ఈ కొత్త వాహనం ఎంతగానో దోహదపడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అగ్నిమాపక సేవలను మరింత బలోపేతం చేయడంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో ఇది ఒక కీలక ముందడుగు అని ఆయన అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారులు, సిబ్బంది మరియు స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అత్యవసర సమయాల్లో అగ్నిమాపక దళాన్ని సంప్రదించడానికి 101 నంబర్‌కు డయల్ చేయాలని అధికారులు ఈ సందర్భంగా ప్రజలకు గుర్తు చేశారు.



# మంజూరైన నిధులు వాడుకోలేని అసమర్ధ ప్రభుత్వం

- రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు
- ఎక్కువైన రోడ్డు ప్రమాదాలు
- బిజెపినే పరాన్నజీవి
- ప్రభుత్వాల మార్పు కోరుకుంటున్న ప్రజలు
- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లె – సూర్య వాస్తవం :** కేంద్ర ప్రాయోజిత పథకాల కింద కేంద్ర ప్రభుత్వము విడుదల చేసిన నిధులను కూడా చంద్రబాబు ప్రభుత్వం వినియోగించలేకపోవడం దురదృష్టకరం, శోచనీయమని రాజ్యసభ మాజీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ఆవేదన వెలిబుచ్చారు. సోమవారం వేంపల్లి లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ 2024 - 25 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రాయోజిత పథకాల కింద కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి 14, 109 కోట్ల రూపాయలు విడుదల చేయగా అందులో కేవలం 7849 కోట్ల రూపాయలు మాత్రమే అనగా 55 శాతం నిధులు మాత్రమే ఖర్చు చేసింది అన్నారు. అదేవిధంగా 2025 - 26 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం కేంద్ర ప్రాయోజిత పథకాల కింద 113204 కోట్ల రూపాయలు విడుదల చేయగా అందులో కేవలం 3851కోట్ల రూపాయలు అనగా 34 శాతం మాత్రమే ఖర్చు చేయడం జరిగింది. చంద్రబాబు ప్రభుత్వం అసమర్థతకు,చేతగానితనానికి ఇది నిదర్శనం. చంద్రబాబు ప్రభుత్వం అసమర్థత వల్ల రాష్ట్రం నష్టపోతున్నదని తులసి రెడ్డి ఆవేదన వెలిబుచ్చారు.

### శాంతి భద్రతలు

రాష్ట్రంలో శాంతిభద్రతలు రోజురోజుకు క్షీణిస్తున్నాయని తులసి రెడ్డి ధ్వజమెత్తారు. ఏప్రిల్ 28వ తేదీన చిత్తూరు జిల్లా వీకోట లో ఆంధ్రజ్యోతి విలేకరి జగన్మోహన్ రెడ్డిని రౌడీషీటర్, స్మగ్లర్ తమీం దారుణంగా హత్య చేశాడు. కడప రిమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలో కత్తులతో ప్రత్యర్థులు పెద్ద దస్తగిరిని హత్య చేశారు. మే 9వ తేదీన కడప నగరంలో అల్మాస్ పేట సర్కిల్లో మత ఘర్షణలు జరిగాయి. ఈ ఘర్షణలో కడప తాలూకా సిఐ నరసింహారాజుతో పాటు పలువురు సిబ్బందికి గాయాలయ్యాయి. నిందితుల వద్ద గంజాయి, డ్రగ్స్,ఇంజక్షన్లు దొరికాయి. పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి మండలం ఈడూరు గ్రామంలో శనివారం మద్యం మత్తులో తండ్రి గణేష్ కొడుకు శామ్యూల్ను హత్య చేశాడు. ఇలాంటి సంఘటనలు ప్రతిరోజు అనేకం జరుగుతున్నాయి. 90 శాతం కేసుల్లో నిందితులు మద్యానికి, డ్రగ్స్ కు,గంజాయికి బానిసలు అయినట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం మద్యాన్ని ఆర్థిక వనరుగా భావిస్తుంది. ఒక వైపు తాగుబోతులను ప్రోత్సహిస్తూ మరొకవైపు శాంతి భద్రతలను ఉక్కు పాదంతో అనచి వేస్తానని ప్రభుత్వం చెప్పడం హాస్యాస్పదం.

### రోడ్డు ప్రమాదాలు

రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు రోజురోజుకు ఎక్కువవుతున్నాయి. ఏటా దాదాపు 8750 మంది ప్రాణాలు కోల్పోతున్నారు. దాదాపు 27 వేల మంది క్షతగాత్రులవుతున్నారు. నిర్లక్ష్యం, అతివేగం సీట్ బెల్ట్ పెట్టుకోకపోవడం,హెల్మెట్ ధరించకపోవడం,మద్యం సేవించి వాహనాలు నడపడం సెల్ఫోన్లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం,ఇలాంటి అనేక కారణాలు రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ప్రభుత్వం రోడ్డు ప్రమాదాల నివారణ కోసం, తగ్గించడం కోసం కృషి చేయకపోవడం శోచనీయం.

### బిజెపినే పరాన్న జీవి

కాంగ్రెస్ పార్టీని పరాన్న జీవి అని ప్రధానమంత్రి పేర్కొనడం హాస్యాస్పదం. ఆ మాటకొస్తే బిజెపి పార్టీనే పరాన్న జీవి అని తులసి రెడ్డి అన్నారు. కేంద్రంలో బిజెపి పార్టీకి సొంత మెజార్టీ లేదని,అటు తెలుగుదేశం పార్టీ,ఇటు జేడియు పార్టీపై ఆధారపడి పరాన్న జీవిగా కేంద్రంలో అధికారంలో ఉందని తులసిరెడ్డి ఎద్దేవా చేశారు.

### మార్పు

ప్రజలు మార్పు కోరుకుంటున్నారని ప్రధానమంత్రి చెప్పడం నిజమేనని తులసి రెడ్డి అన్నారు. వచ్చే లోక్సభ సార్వత్రిక ఎన్నికల్లో, ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో కూడా ప్రజలు మార్పు కోరుకుంటున్నారని తులసి రెడ్డి అన్నారు. కేంద్రంలో బిజెపిని మార్చి కాంగ్రెస్ను అధికారంలోకి తేవాలని,అదేవిధంగా రాష్ట్రంలో అటు టిడిపిని, ఇటు వైకాపాను మార్చి కాంగ్రెస్ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తులసి రెడ్డి అన్నారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కదిరి ప్రసాద్ గౌడ్,ఎస్సీ సెల్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు మల్లెం విజయభాస్కర్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి,తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కార్యకర్తలకు నియామక పత్రాలు అందజేత

**మడకశిర – సూర్య వాస్తవం :**



మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజు సోమవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని, నూతనంగా ఎంపికైన అంగన్‌వాడీ కార్యకర్తలకు మొత్తం ఏడుగురు మహిళలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. గుడిబండ మండలం వలస గ్రామానికి చెందిన ఒక మహిళ, మడకశిర ప్రాంతానికి చెందిన ఆరుగురు మహిళలు. ఎమ్మెల్యే నియామక పత్రాలు అందజేసిన అనంతరం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజు లబ్ధిదారులతో మాట్లాడుతూ పలు కీలక సూచనలు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తమ విధులను అత్యంత బాధ్యతా యుతంగా, సక్రమంగా నిర్వహించాలని కోరారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. తల్లీబిడ్డల ఆరోగ్యం మరియు చిన్నారుల పౌష్టికాహారం విషయంలో అంగన్‌వాడీల పాత్ర కీలకమని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మహిళ హత్య కేసులో తల్లీకొడుకు అరెస్ట్

## - డీఎస్పీ కృష్ణమోహన్



**లక్కిరెడ్డిపల్లి – సూర్య వాస్తవం:** మహిళ హత్య కేసులో నిందితులు వేణు, సావిత్రి తల్లి కొడుకులను సోమవారం అరెస్టు చేసి కోర్టుకు పంపుతున్నట్లు రాయచోటి డిఎస్పి కృష్ణమోహన్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి పందిళ్ళపల్లి కస్బా లోని మృతురాలు పసుపులేటి చిన్నక్క 65 పక్కనే ఒకే బజారులో ఉన్న సావిత్రి వేణు తల్లి కొడుకు ఏప్రిల్ 25వ తేదీన ఇంటి ముందర చిన్న గొడవపడి తల్లి కొడుకులు చిన్నక్కను బాత్ రూమ్‌లో గోడకు తలకాయి బాధడంతో తలకు పూర్తిగా గాయాలయాయని దీంతో చిన్నక్కను కడప రిమ్స్‌కు తరలించి చికిత్స చేయిస్తుండగా అందులో ఫిట్స్ వచ్చి పరిస్థితి విషమించడంతో తిరుపతికి తరలించారనీ అక్కడ కూడా పరిస్థితి విషమించడంతో స్వగ్రామం పందిళ్ళపల్లెకు తీసుకొచ్చారని ఈనెల 7 తేదీన చిన్నక్క వేణు సావిత్రిల కొట్టిన దెబ్బలతో మృతి చెందినట్లు తమ కోడలు రామాంజనమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు లక్కిరెడ్డిపల్లి పోలీస్ స్టేషన్లో సీఐ కృష్ణంరాజు నాయక్ ఎస్ఐ గోల్కొండ శోభ కేసు నమోదు చేశారని ఈ మేరకు సోమవారం బాధితులను అదుపులో తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్ పంపుతున్నట్లు ఆయన తెలిపారు.

# ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరం

## - మాస్టర్ అక్బర్ అలీ





**కదిరి – సూర్య వాస్తవం :** పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో జరిగిన కియో జపాన్ షోటోఖాన్ కరాటే–డో అసోసియేషన్ ఇండియా (కేకే ఎస్ ఎస్) ఆధ్వర్యంలో ఖాద్రి కరాటే స్పోర్ట్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ ప్రెసిడెంట్ మాస్టర్ అక్బర్ అలీ నిర్వహించిన కరాటే బెల్ట్ పరీక్షలు ఘనంగా జరిగాయి. ఈ పరీక్షల్లో 21 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. విద్యార్థులు పంచెస్, కిక్స్, బ్లాకింగ్స్, సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్, నంచాక్ రొటేషన్స్, స్టిక్ రొటేషన్స్ వంటి విన్యాసాలను అద్భుతంగా ప్రదర్శించి అక్కడికి విచ్చేసిన తల్లిదండ్రులను ఆకట్టుకున్నారు. ఈ బెల్ట్ పరీక్షల్లో 11 మంది ఆరెంజ్ బెల్ట్, 5 మంది గ్రీన్ బెల్ట్, 3 మంది బ్లూ బెల్ట్ సాధించారు. అలాగే ప్రేక్షశ్రీ బ్రౌన్ బెల్ట్, అసద్ బ్లాక్ బెల్ట్ సాధించి ప్రత్యేక ప్రతిభ కనబరిచారు. విజేతలకు ఖాద్రి కరాటే స్పోర్ట్స్ అసోసియేషన్ ఏపీ ప్రెసిడెంట్ మాస్టర్ అక్బర్ అలీ చేతుల మీదుగా బెల్టులు, ధృవీకరణ పత్రాలు అందజేయ బడినాయి. ఈ సందర్భంగా మాస్టర్ అక్బర్ అలీ మాట్లాడుతూ, “కరాటే ద్వారా విద్యార్థుల్లో శారీరక దృఢత్వం, మానసిక ధైర్యం, క్రమశిక్షణ, ఆత్మరక్షణ నైపుణ్యాలు పెంపొందుతాయి. మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులను ఆరోగ్య వంతులుగా, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు సహాయ పడతాయి” అని తెలిపారు. విద్యార్థులకు శిక్షణ అందిస్తున్న మాస్టర్ అక్బర్ అలీని తల్లిదండ్రులు దుశ్శాలువాతో సత్కరించి, పూలమాలలతో ఘనంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కరాటే కోచ్ రియాజ్, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు క్రీడాభిమానులు పాల్గొన్నారు.

# ఇతర రాష్ట్రాల వ్యక్తులు పోలీస్ స్టేషన్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలి

## - సీఐ కృష్ణంరాజు నాయక్

**లక్కిరెడ్డిపల్లి – సూర్య వాస్తవం:** మండలంలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి కార్మికులుగా పనిచేస్తున్న వ్యక్తులు లక్కిరెడ్డిపల్లి పోలీస్ స్టేషన్లో తమ పేర్ల వివరాలు నమోదు చేసుకోవాలని సిఐ కృష్ణంరాజు నాయక్ తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి బ్రతుకుతెరువు కోసం వచ్చి ఇతర ఇతర పనులు చేసుకుంటు నివాసం ఉంటున్న కొత్త వ్యక్తులు తమ ఆధార్ కార్డు వివరాలతో పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసుకోవాలనీ వారు సూచించారు. కొత్త వ్యక్తులకు తెలియకపోయిన తమ వద్ద పనిచేయించుకుంటున్న రైతులు, యజమానులు స్టేషన్‌కు వచ్చి వారి పేర్లు, వివరాలు నమోదు చేయించాలన్నారు.

# కలెక్టర్ సారు....టీ స్టాల్‌ను తొలగించండి

- టీ స్టాల్ వల్ల ప్రభుత్వ మహిళా హాస్టల్ విద్యార్థులకు ఇబ్బందులు
- నిత్యం రద్దీ ఉన్న ప్రాంతంలో ట్రాఫిక్ తీవ్ర అంతరాయం
- టీ స్టాల్‌ను తొలగించకపోతే ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధం
- కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ టీస్టాల్‌ను తొలగిస్తామని హామీ
- ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఆనంద్‌కి వినతి పత్రం అందజేత



**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం:** అనంతపురం నగరంలో ఆది మూర్తి నగర్ ప్రాంతంలో గిల్డప్ సర్వీస్ స్కూల్ కాంపౌండ్ గోడలో ఉన్న టీ స్టాల్ ను తొలగించాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయంలో గ్రీవెన్స్ లో జిల్లా కలెక్టర్ ఆనంద్‌కి కలిసి వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి మాట్లాడుతూ నిత్యం రధి ఉన్న ప్రాంతంలో గిల్డప్ స్కూల్ కాంపౌండ్ వాల్ లో ఏర్పాటు చేసిన టీ స్టాల్ వల్ల పక్కనే ఉన్న ప్రభుత్వ మహిళా హాస్టల్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు వాటితో పాటు నిత్యం ఈ ప్రాంతంలో ఎస్పీ కార్యాలయం ప్రైవేట్ ఆసుపత్రులు ఉండడం వలన జన సంచారం ఎక్కువగా వస్తూపోతూ ఉంటారు అక్కడ టీ స్టాల్ వల్ల వందల మంది సామాన్య ప్రజలు రోడ్ల మధ్యలో టు వీలర్లు వదిలేసి ఉంటారు దాని వల్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది..టి స్టాల్ దగ్గర నుండి మహిళా విద్యార్థులు రోజు పాఠశాలకు కళాశాలకు 1000 నుంచి 1500 మంది విద్యార్థులు ఉదయము సాయంత్రం వస్తూపోతూ ఉంటారు ఆ సమయంలో చిన్న పిల్లలు కళాశాల విద్యార్థినిలు వేధింపులకు గురవుతున్నారని తెలిపారు. టీ స్టాల్ కు వచ్చే కస్టమర్లు బహిరంగ ధూమపానం మరియు టీ సేవిస్తూ వారి వాహనాలను రోడ్డుకు అడ్డంగా నిలిపి ఉండడం వలన ట్రాఫిక్ సమస్య ఏర్పడిందన్నారు ముఖ్యంగా అక్కడికి వచ్చే యువకులు మహిళా హాస్టల్ విద్యార్థుల పట్ల యూటీజింగ్ ర్యాగింగ్ చేస్తున్నారు దీనివల్ల విద్యార్థులు మానసికంగా గురవుతున్నారు. ఈ హాస్టల్లో ఉండే మహిళా విద్యార్థులకు భద్రతకు ఈ టీ స్టాల్ తీవ్రమైన ముప్పుగా ఉన్నది ఉదయం మరియు సాయంత్రం వేళలో ఈ టీ స్టాల్ దగ్గర జన సంచారం అధికంగా ఉండడం వలన తీవ్ర ఇబ్బందికరంగా ఉంది. ప్రభుత్వ బాలికల హాస్టల్ దగ్గర బహిరంగ ధూమపానం అల్లరి మొక్కలు టీ స్టాల్ వేదికగా ఇలాంటి కార్యక్రమాలకు నిలయంగా ఉన్న టీ స్టాల్ ను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు మహిళా విద్యార్థినిల భద్రత చదువు, భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని హాస్టల్ సమీపంలో ఉన్న టీ స్టాల్ ను మరొక ప్రాంతానికి మార్చే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు నిత్యం ప్రతిరోజు వందల వెహికల్స్ తిరిగే ప్రాంతంలో టీ స్టాల్ అక్కడ ఉండడం వలన ఉదయం సాయంత్రం సగం రోడ్డుకు అడ్డంగా టు వీలర్లు పెట్టి ఉంటారు పక్కనే హాస్పిటల్స్ కూడా ఉన్నాయి ఎవరికైనా ఎమర్జెన్సీగా ఉండి అంబులెన్స్ లో వెళ్లాలన్నా కూడా దారి ఉండనేటువంటి పరిస్థితి అక్కడ ఉంటుందన్నారు పదిసార్లు ఆరని కొట్టినా కూడా ఎవరు కూడా బైకు తీయని పరిస్థితి. ఇలాంటి ప్రాంతంలో టీ స్టాల్ ఉండడం వల్ల ప్రజలకు మరియు మహిళా హాస్టల్ విద్యార్థినిలకు ఇబ్బందికరంగా ఉంటుంది కావున తక్షణమే టీ స్టాల్‌ను తెలిపారు లేనిపక్షంలో టీ స్టాల్ ను తొలగించకపోతే ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధమవుతామని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆనంద్ ఈ సమస్య పైన సానుకూలంగా స్పందిస్తూ ఇప్పటికే గిల్డప్ సర్వీస్ స్కూల్ ట్రస్ట్ వారికి తెలియజేయడం జరిగింది మరొకసారి వారికి తెలియజేసి టి స్టాల్ తొలగిస్తామని తెలపడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వంశీ సహాయ కార్యదర్శి. ఉమా మహేష్ నగర అధ్యక్షులు మంజునాథ్ జిల్లా ఆఫీస్ నగర నాయకులు నాని ఆఫాన్ తదితరులు పాల్గొన్నారు.



# సీఎం రేవంత్ రెడ్డి ఎవరికి లొంగడు, అదరడు, బెదరడు

### -అన్నమయ్య డిసిసి అధికార ప్రతినిధి ఆడిటర్ మన్సూర్ అలీ ఖాన్



**రాయచోటి - సూర్య వాస్తవం:** తెలంగాణలో రూ.9,400 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులను ప్రారంభించ డానికి, శంకు స్థాపనలు చేయడానికి ప్రధాని నరేంద్ర మోడీ వచ్చినట్లు లేదు. సీఎం రేవంత్ రెడ్డిని ఇరుకున పెట్టడానికి వచ్చినట్లు ఉందని అన్నమయ్య డిసిసి అధికార ప్రతినిధి ఆడిటర్ మన్సూర్ అలీ ఖాన్ అన్నారు. సోమవారం ఆయన తమ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోడీ అన్ని రాష్ట్రాలకు సమానంగా నిధులు పంచిపెట్టి అభివృద్ధి చేయాలి గాని 'మాతో కలసి నడవండి అప్పుడు ఇంకా మంచిది. గత పదేళ్ళలో గుజరాత్ కు ఇచ్చినన్ని నిధులు తెలంగాణకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని రేవంత్ రెడ్డితో మోడీ వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిల మధ్య జరిగిన సంభాషణ, ముఖ్యంగా ప్రధాని చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరమైన చర్చకు దారితీశాయని ఆయన చెప్పారు. ఇది కేవలం అభివృద్ధి గురించిన చర్చలా కాకుండా, రాజకీయ వ్యంగ్యంతో కూడిన సంభాషణగా నిలిచాయని అన్నారు. ఇలాంటి సమయంలో రాజకీయాలు మాట్లాడనని రేవంత్ రెడ్డి చెప్పి బిజెపిలో దడ పుట్టించాడని ఆయన అన్నారు. మోదీ కూడా రాజకీయాలు మాట్లాడనని, కానీ "డబుల్ ఇంజన్" అభివృద్ధి అవసరమని సూచించడం వెనుక కారణాలు ఏమిటో అందరికి తెలుసు అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎవరికి లొంగడు, అదరడు, బెదరడు అని ఆయన అన్నారు. తెలంగాణ సీఎంను ఇరుకున పెట్టే ప్రయత్నంగా చేసిన మోదీ ప్రయత్నం విఫలం అయింది అన్నారు.

# కె.ఎస్.ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఉద్యోగమేళా



**అనంతపురం - సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో మే 14, 2026 గురువారం నాడు కె.యస్.యన్. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు కె.యస్.యన్. ప్రభుత్వ మహిళాడిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. యం. ప్రగతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నత విద్యామండలి ప్రణాళిక ప్రకారం కె.ఎస్.ఎన్. ప్రభుత్వ కళాశాల నోడల్ రిసోర్స్ సెంటర్ పరిధిలోని కళాశాలల్లో చదువుతున్న మూడవ సంవత్సరం విద్యార్థుల కోసం ఉద్యోగమేళా నిర్వహించబడుతోందని ఆమె పేర్కొన్నారు. ఈ ఉద్యోగమేళాలో కళాశాలలోని తృతీయసంవత్సరం విద్యార్థినులతో పాటు ఇతర నిరుద్యోగ యువతీయువకులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జె.కె.సి ప్లేస్మెంట్ కోఆర్డినేటర్ బి.అనురాధ తెలిపారు. ఈ ఉద్యోగమేళాలో '11' కంపెనీలు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయని, పాల్గొనదలచిన నిరుద్యోగ యువతీ యువకులు తమ బయోడేటాతో పాటు, అర్హతలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలతో గురువారం ఉదయం పది గంటలకు కళాశాలలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

# నేడు మండల వ్యాప్తంగా హనుమజయంతి మహోత్సవాలు

### - విద్యుత్ కాంతులతో కళకళలాడుతున్న ఆలయాలు



**చెన్నూరు - సూర్య వాస్తవం:** మండల కేంద్రమైన చెన్నూరు బ్రాహ్మణ వీధిలో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం హనుమజయంతి మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. పుష్పగిరి పీఠాధిపతి అభినవ ఉద్దండ శ్రీ శ్రీ శ్రీ విద్యాశంకర భారతి స్వాములవారి ఆశీర్వాదాలతో ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభం కానుండగా, 5:30 గంటలకు మూలవిరాట్ విగ్రహానికి అభిషేకం, అలంకరణ నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటల నుంచి భక్తులకు స్వామివారి దర్శనం కల్పించనున్నారు. అనంతరం 8:30 గంటలకు ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక అభిషేకం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. సాయంత్రం 4 గంటల నుంచి గ్రామ పురవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించనుండగా, కోలాటం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టు కోనున్నాయి. ఇక చెన్నూరులోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో వెలసిన శ్రీ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అలాగే కడప-కర్నూలు జాతీయ రహదారిపై బుడ్డాయిపల్లి గ్రామ సమీపంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలు, పూజలు చేపట్టనున్నారు. పెన్నా నది ఒడ్డున వెలసిన నిలువెత్తు ఆంజనేయస్వామి విగ్రహం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించనుండగా, పెన్నా నది అవతలి ఒడ్డున ఉన్న ఆంజనేయపురంలోని ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో కూడా విశేష పూజలు కొనసాగుతున్నాయి. కనపర్తి, రామనపల్లి గ్రామాల్లోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో కూడా హనుమజయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. హనుమజయంతి సందర్భంగా మండలంలోని ఆలయాలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఆలయాల ఎదుట శోభాయమానమైన పందిళ్లు ఏర్పాటు చేసి భక్తులకు సౌకర్యాలు కల్పించారు.

# వైసీపీ నాయకునికి ఎంపీ అవినాష్ రెడ్డి పరామర్శ



**వేముల - సూర్య వాస్తవం :** పులివెందుల నియోజకవర్గం వేముల మండలం భూమయ్య గారి పల్లెకు చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యులు వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు శ్రీరామిరెడ్డి ని అనారోగ్య బారిన పడిన విషయం తెలుసుకొని కడప పార్లమెంట్ సభ్యులు వైయస్ అవినాష్ రెడ్డి పరామర్శించారు. వైకాపా సీనియర్ నాయ కులు శ్రీరామ్ రెడ్డి అనారోగ్య పరిస్థితి తెలుసుకున్న ఎంపీ అవినాష్ రెడ్డి వారి స్వగృహానికి వెళ్లి అధైర్యపడవద్దని అన్ని విధాలుగా అండగా ఉంటామని వారి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించే ప్రయత్నం చేశారు. ఈ కార్యక్రమంలో వేముల మండల కన్వీనర్ నాగేళ్ల సాంబశివారెడ్డి, జడ్పిటిసి సభ్యులు కోగటం భయపరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్, రాష్ట్ర బీసీ ఉపాధ్యక్షులు వల్లపు వరప్రసాద్, మండల నాయకులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గోకులం బిల్లులు ఆలస్యం

### - పాడి రైతులకు కష్టాలు




**ఉరవకొండ - సూర్య వాస్తవం :** పాడి రైతులను ప్రోత్స హించేందుకు కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన గోకులం పథకం కింద పలువురు పాడి రైతులు అప్పులు చేసి షెడ్లు నిర్మించుకున్నారు. వాటిని గత యేడాది నిర్మించుకోగా ఇప్పటికీ సంబంధిత బిల్లులను జమ చేయక పోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా 90శాతం రాయితీ వర్తిస్తుందనే యోచనతో కొందరు రైతులు గోకులం షెడ్లను నిర్మించుకునేందుకు ముందుకు వచ్చారు. నిర్మాణాలు పూర్తి అయిన వాటికి బిల్లులు రాకపోవడంతో ఆ రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే గత ఆర్థిక సంవత్సరం తర్వాత, ఉపాధి హామీ పథకంలో నిర్మాణాలు చేపట్టని యూనిట్లన్నీ రద్దు అయ్యాయి. ఉరవకొండ మండలంలో రెండో విడతలో 32 గోకులం షెడ్లు మంజూరయ్యాయి. వీటిలో 29 నిర్మాణాలు పూర్తి కాగా, 16 షెడ్లకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే వజ్రకరూరు మండలంలో 30 గోకులం షెడ్లు మంజూరు కాగా 10 పూర్తి అయ్యాయి. 16 షెడ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. 12షెడ్లకు సంబంధించి బిల్లులు మంజూరు కావాల్సి ఉంది. త్వరగా నిర్మాణాలు చేపడితే మార్చి లోపు బిల్లులు పడతాయని లేకపోతే రద్దు అయితాయని అధికారులు ఒత్తిడి తీసుకురావడంతో పాడి రైతులు అప్పులు తెచ్చి నిర్మాణాలు చేపట్టారు. అయితే నెలలు గడుస్తున్నా బిల్లులు మంజూరు కాలేదని ఆ రైతులు తెలిపారు. ఈ విషయంపై ఏపీవో సుజాతను వివరణ కోరగా సాంకేతిక సమస్యల వలన బిల్లుల చెల్లింపులో కొంత జాప్యత జరుగుతోందన్నారు. త్వరలోనే పాడి రైతుల ఖాతాల్లోకి బిల్లులు జమ అయ్యే అవకాశం ఉందని తెలిపారు.

# మఠం దేవస్థానికి ఫ్రిజ్ వితరణ

**బ్రహ్మంగారిమఠం - సూర్య వాస్తవం:** మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు యాజమాన్యం వారు జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వాములవారి మఠంనకు సోమవారం మఠాధిపతులు శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాముల వారి చేతుల మీదుగా మంచినీటి ఫ్రిజ్‌ను దేవస్థానముకు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని మఠాధిపతుల వారు స్వయంగా వేద పండితులతో పూజ కార్యక్రమాలు నిర్వహించి మేనేజర్ ఈశ్వరయ్య చారి సమక్షంలో ఫ్రిజ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ నాగార్జున మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం వేసవిని దృష్టిలో ఉంచుకొని భక్తులకు దాహర్తిని తీర్చడం కోసం మంచి నీటి ఫ్రిజ్‌ను అందచేయడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది జయన్న, పూజారి పవన్ స్వామి మఠం సిబ్బంది పాల్గొన్నారు.



# గంజాయి జోలికి వెళితే కఠిన చర్యలు

### - సైబర్ నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలి

### - సీఐ చాంద్ బాషా



**చెన్నూరు - సూర్య వాస్తవం :** జిల్లా ఎస్పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు చెన్నూరు సి.ఐ చాంద్ బాషా ఆధ్వర్యంలో సోమవారం న్యూ గాంధీ నగర్, లక్ష్మి నగర్ ప్రాంతాల్లో యువతకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గంజాయి వినియోగం వల్ల యువత భవిష్యత్తు నాశనం అవుతుందని, గంజాయి జోలికి వెళితే కఠిన చర్యలు తప్పవని సి.ఐ హెచ్చరించారు. అలాగే సైబర్ క్రైమ్‌లు, సోషల్ మీడియా మోసాలు, మహిళల భద్రతపై యువతకు అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ కాల్స్, ఓటీపీ మోసాలు, సోషల్ మీడియా అకౌంట్ హ్యాకింగ్ వంటి ఘటనలపై వివరించారు. అనుమానాస్పద లింకులు ఓపెన్ చేయవద్దని, వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ వివరాలు, ఓటీపీలు ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే హెల్ప్‌లైన్ లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, స్థానిక యువత పాల్గొన్నారు.

## సొమ్ము ప్రభుత్వానిది సోకు ప్రైవేటు వ్యక్తులది

### - ప్రభుత్వ బోరును తన సొంత భూమికి ఉపయోగించుకుంటున్న ఓ రాజకీయ నేత
### - నిమ్మకు నీరెత్తినట్టున్న అధికారులు



**కుప్పం - సూర్య వాస్తవం:** గ్రామస్తులు తాగునీటికి అష్ట కష్టాలు పడుతుంటే ఓ రైతు ప్రభుత్వ బోరును తన సొంత పొలం కోసం వాడుకుంటున్న వైనం కుప్పం మండలం వేపూరు మిట్టపల్లిలో వెలుగు చూసింది. వేపూరు మిట్టపల్లి గ్రామంలో ప్రజల అవసరాలు తీర్చేందుకు అధికారులు తాగునీటి బోరును ఏర్పాటు చేశారు. అయితే ఆ బోరుకు పైపులు బిగించి స్థానికంగా ఓ రాజకీయ నాయకుడు తన సొంత పొలానికి ఆ బోరును శాశ్వతంగా ఉపయోగించు కుంటున్నారని ఆ ఊరి ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా అధికారులు తమకేమీ పట్టనట్లు ఉండిపోవడంతో ఆ ఊర్లో తాగునీటి కష్టాలు ఎక్కువయ్యాయని ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు. తమ గ్రామ ప్రభుత్వ త్రాగు నీటి బోరును ప్రైవేటు వ్యక్తి ఉపయోగించుకుంటున్న వైనంపై అధికారులు మౌనం వహిస్తున్నారని, స్థానికులు మీడియాకు తెలిపారు. ఇప్పటికైనా అతనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. కాగా ఈ విషయమై స్థానిక పంచాయతీ కార్యదర్శి వివరణ కోసం ఫోన్లో సంప్రదించడానికి ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాకపోవడంతో ఎంపీడీవో వెంకటేశ్వర్లు తన దృష్టికి రాలేదని మంగళవారం సదరు సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేస్తామన్నారు.

## ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కూలీల వివరాలను తెలియజేయాలి

### - రాయచోటి అర్బన్ సిఐ బీవీ చలపతి



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం :** రాయచోటి పోలీస్ శాఖ తరపున ప్రజలందరికీ, ముఖ్యంగా భవన నిర్మాణ కాంట్రాక్టర్లు, హోటల్ యజమానులు, లాడ్జ యజమానులు, నివాస గృహాల యజమానులు, వ్యాపార సంస్థల యజమానులు, ఇటుక బట్టీల యజమానులు, గోదాముల యజమానులు, ఇతర ప్రాంతాల నుండి వచ్చిన కార్మికులను పనిలో ఉంచుకున్న వారందరికీ ఈ ప్రకటన ద్వారా తెలియజే యునదేమనగా, మన రాయచోటి పట్టణమునకు వివిధ రాష్ట్రాల నుండి అనేక మంది కార్మికులు వచ్చి భవన నిర్మాణ పనులు, హోటళ్లలో సేవలు, ఇటుక బట్టీలలో పనులు, డ్రైవర్లుగా, గృహ సేవకులుగా, వాచ్‌మెన్లుగా, పరిశ్రమలలో మరియు ఇతర వృత్తులలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇట్టి ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికుల పూర్తి వివరాలు సంబంధిత పోలీస్ స్టేషన్ వద్ద నమోదు చేయించడం ప్రతి యజమాని, కాంట్రాక్టర్, బాధ్యులైన వ్యక్తుల చట్టబద్ధమైన బాధ్యతగా భావించవలెను. ఈ క్రమంలో ఎవరి వద్ద ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు పనిచేస్తున్నారో, వారు తమ వద్ద పనిచేస్తున్న ప్రతి కార్మికుడిని రెండు (2) లేదా మూడు (3) రోజులలోగా రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి హాజరు పరచాలన్నారు.అదేవిధంగా, ఆ కార్మికుల పూర్తి పేరు, తండ్రి పేరు, స్వస్థల చిరునామా, ఆధార్ నంబర్, మొబైల్ నంబర్, గతంలో పనిచేసిన ప్రదేశం, ప్రస్తుతం పనిచేస్తున్న ప్రదేశం, యజమాని పేరు, కాంట్రాక్టర్ పేరు, ఫోటోలు, ఇతర అవసరమైన వివరాలను పోలీసు శాఖ నిర్దేశించిన ప్రొఫార్మాలో పూర్తి చేసి సమర్పించాలన్నారు. ఇటీవల కాలంలో వివిధ ప్రాంతాలలో గుర్తు తెలియని వ్యక్తులు కార్మికుల పేరుతో వచ్చి అనుమానాస్పద కార్యకలాపాలకు పాల్పడిన సందర్భాలు గమనించబడినందున, ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ మరియు నేరాల నివారణ దృష్ట్యా ఈ నమోదు ప్రక్రియ తప్పనిసరి చేయబడింది. పోలీసు శాఖ తరచూ నిర్వహించే తనిఖీలలో భాగంగా ఇతర రాష్ట్రాల కార్మికులను ప్రశ్నించినప్పుడు, వారు ఎక్కడ పనిచేస్తున్నారు, ఎవరి వద్ద నివసిస్తున్నారు, ఎవరి ఆధ్వర్యంలో పనిచేస్తున్నారు అనే వివరాలు వెల్లడించిన సందర్భంలో, ఆ కార్మికుల వివరాలు పోలీస్ స్టేషన్ రికార్డుల్లో లేనట్లయితే సంబంధిత యజమాని, కాంట్రాక్టర్ లేదా బాధ్యులైన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తప్పనిసరిగా తీసుకుంటామన్నారు. కావున రాయచోటి పట్టణ ప్రజలందరూ, ముఖ్యంగా యజమానులు మరియు కాంట్రాక్టర్లు, ఈ విషయాన్ని అత్యంత ప్రాముఖ్యతతో తీసుకొని వెంటనే పోలీసు శాఖకు సహకరించి, అవసరమైన వివరాలు సమర్పించి, పట్టణ శాంతి భద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావలసిందిగా మనవి.ప్రజల సహకారమే పోలీస్ శాఖకు బలం అన్నారు.

## భూగర్భ జలాల పునరుద్ధరణకు బీటెక్ రవి భగీరథ ప్రయత్నం

### - క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్న పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ అమర్నాథ్ యాదవ్



**లింగాల - సూర్య వాస్తవం:** లింగాల మండలంలోని గుణకనపల్లె, రామానుంతల పల్లె, చిన్నకుడాల గ్రామాల్లో అడుగంటిన భూగర్భ జలాల పునరుద్ధరణ కోసం పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి తన సొంత నిధులతో ఒక బృహత్తర ప్రాజెక్టును చేపట్టారు. పిబిసి పైపులైన్ ద్వారా వచ్చే నీటిని కొత్తగా వేసిన బోర్లలోకి పంపించడం ద్వారా భూగర్భ జలాలను రీఛార్జ్ చేసే వినూత్న ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్ రైతుల సమస్యను వివరించగానే స్పందించిన బీటెక్ రవి యుద్ధ ప్రాతిపదికన ఈ పనులను ప్రారంభించారు. తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి ఆదేశాల మేరకు పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్ స్వయంగా క్షేత్రస్థాయిలో ఉండి ఈ భగీరథ ప్రయత్నాన్ని పర్య వేక్షిస్తున్నారు. బీటెక్ రవి చేపట్టిన ఈ భగీరథ ప్రయత్నం విజయవంతం అయ్యితే ఆయా గ్రామాల రైతులకు సాగు, తాగునీటి సమస్యల నుండి శాశ్వత ఉపశమనం లభించనుంది.

## పీజీఆర్ఎస్ అర్జీలకు సకాలంలో నాణ్యతతో పరిష్కారం చూపాలి

### - జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:** మదనపల్లి కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో సోమవారం అన్నమయ్య జిల్లా మదనపల్లి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తోపాటు.. జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి,సర్వే శాఖ ఏడి భరత్ కుమార్ లు అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ ల అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. అర్జీలను వేగవంతంగా, నాణ్యతగా పరిష్కరించాలన్నారు. ఎలాంటి పెండింగ్ లేకుండా అర్జీలను పరిష్కరించాలని, గ్రీవెన్స్ పై ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలని, ఇందులో ఎలాంటి అలసత్వం ఉండరాదన్నారు. సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. అర్జీలను గడువులోపు అత్యంత నాణ్యతగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.

**ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు**

నిమ్మనపల్లి మండలం, నిమ్మనపల్లి గ్రామపంచాయతీకి చెందిన కోళ్ల వెంకటరమణ తనకు రెండు కాళ్లు పూర్తిగా పనిచేయకుండా పోవడంతో నడవలేని స్థితిలో ఉన్నానని, ప్రభుత్వం నుండి మూడు చక్రాల వాహనాన్ని మంజూరు చేయాల్సిందిగా కలెక్టర్ కు విన్నవించుకున్నారు.

కె.వి పల్లి మండలం ఎగువరాజుపల్లికి చెందిన సి. పార్వతికి వేలిముద్రలు, కంటి గుర్తింపు నమోదు కాకపోవడంతో ఈ-కేవైసీ పూర్తి కాక మే నెల ఎన్టీఆర్ భరోసా పెన్షన్ నిలిచిపోయింది. ప్రత్యామ్నాయ విధానంలో ఈ-కేవైసీ పూర్తి చేసి పెన్షన్ మంజూరు చేయాలని కలెక్టర్ కు దరఖాస్తును సమర్పించారు. పుంగనూరు మండలం అక్కిం వారి పల్లి పంచాయతీ లోని గోడ వారి ఎం. శ్రీనివాసులు తనకు సర్వే నెంబరు 298 లో 50 సెంట్లు విస్తీర్ణం కలదని మా భూమి ఫ్రీ హోల్డ్ లో పడిందని ఫ్రీ హోల్డ్ నుంచి తొలగించాలని కలెక్టర్ కు విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రకాల సమస్యలపై మొత్తంగా 383 అర్జీలను దరఖాస్తుదారులు సమర్పించారు. ఈ సమస్యలన్నీ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ స్థాయిలో అన్నమయ్య ఖ్యాతిని చాటిన చిన్నారి

### - నేషనల్ స్పెల్ బీ విజేత శైలేష్ గౌడ్‌ను అభినందించిన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:** గ్రామీణ ప్రభుత్వ పాఠశాల నుంచి జాతీయ స్థాయికి ఎదిగి అన్నమయ్య జిల్లా ప్రతిష్టను దేశవ్యాప్తంగా చాటిన చిన్నారి విద్యార్థి బి. శైలేష్ గౌడ్‌ను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. ముంబైలో ఏప్రిల్ 22న నిర్వహించిన నేషనల్ లెవల్ స్పెల్లింగ్ బీ పోటీలలో దేశవ్యాప్తంగా ప్రతిభావంతుల మధ్య పోటీపడి.. జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన శైలేష్ గౌడ్ (2వ తరగతి విద్యార్థి)ను సోమవారం కలెక్టర్ కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థి శైలేష్ గౌడ్ నైపుణ్యాన్ని కలెక్టర్ కొద్దిసేపు పరీక్షించి.. విద్యార్థి ప్రతిభకు ముగ్ధులయ్యారు. విద్యార్థికి మనస్ఫూర్తిగా అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.

అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... పెద్దమండ్యం మండలం వెలిగల్లు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న శైలేష్ గౌడ్, తన చిన్న వయస్సులోనే అసాధారణ ప్రతిభ కనబరచడం ఎంతో గర్వకారణమన్నారు. ఉపాధ్యాయుడు బి. మధుకర్ రెడ్డి సమర్థమైన మార్గదర్శకత్వంలో జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయి పోటీలలో వరుసగా ప్రథమ స్థానాలు సాధించి, అనంతరం జాతీయ స్థాయిలో దేశంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థల విద్యార్థులతో పోటీపడి సెకండ్ ర్యాంక్ సాధించడం అన్నమయ్య జిల్లాకే గర్వకారణమని పేర్కొన్నారు గ్రామీణ ప్రాంతంలోని సాధారణ తరగతి గది నుంచి దేశ స్థాయి వేదికపై నిలవడం ప్రతి విద్యార్థికి స్ఫూర్తిదాయకమని కలెక్టర్ తెలిపారు. "ఆత్మవిశ్వాసం, పట్టుదల, కష్టపడి సాధించాలనే తపన, ఉపాధ్యాయుల సమర్థమైన మార్గదర్శకత్వం ఉంటే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కూడా అత్యున్నత శిఖరాలను అధిరోహించగలరని శైలేష్ విజయం మరోసారి నిరూపించిందని" అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అపారమైన ప్రతిభ దాగి ఉందని, ఆ ప్రతిభను గుర్తించి సరైన దిశలో తీర్చిదిద్దితే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విజయాలు సాధించడం సాధ్యమని పేర్కొన్నారు. శైలేష్ సాధించిన విజయం జిల్లాలోని వేలాది మంది విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థి శైలేష్ గౌడ్‌ను, ఆయన తండ్రి కిషోర్, అలాగే విద్యార్థిని నిరంతరం ప్రోత్సహించి విజయపథంలో నడిపించిన ఎస్‌జీటీ ఉపాధ్యాయుడు బి. మధుకర్ రెడ్డిని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

జిల్లా విద్యాశాఖ పనితీరును మరింత మెరుగుపరచుకొని గ్రామీణ ప్రాంత విద్యార్థులను జాతీయ స్థాయి ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. భవిష్యత్తులో కూడా ప్రభుత్వ పాఠశాలల నుంచి మరెందరో విద్యార్థులు దేశ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. జిల్లా కలెక్టర్ అభినందనలు అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఉపాధ్యాయుడు మధుకర్ రెడ్డి, విద్యార్థి శైలేష్, విద్యార్థి తండ్రి కిషోర్ తెలిపారు. ఈ విజయానికి వెన్నుదన్నుగా నిలిచిన విద్యాశాఖ అధికారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి డా. కె. సుబ్రహ్మణ్యం, సమగ్ర శిక్ష ఏపీసీ అనురాధ, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఈసెట్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన గీతికకు ఘన సత్కారం..



**పులివెందుల - సూర్య వాస్తవం:** పులివెందుల పట్టణం ముద్దనూరు రోడ్‌కు చెందిన మారుజోళ్ల శివశంకర్ రెడ్డి, చెన్న కేశవి దంపతుల కుమార్తె గీతిక రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఈసెట్ పరీక్షలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించి పులివెందుల పట్టణానికి గర్వకారణంగా నిలిచింది. 2023 బ్యాచ్ పాలీసెట్‌లో ప్రతిభ కనబరిచిన ఈ విద్యార్థిని ఉన్నత స్థాయికి చేర్చాలనే లక్ష్యంతో స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం ప్రత్యేక కోచింగ్ అందించి, క్రమశిక్షణతో మార్గనిర్దేశం చేయడం జరిగింది. ఉపాధ్యాయుల ప్రోత్సాహం, తల్లిదండ్రుల సహకారం, విద్యార్థిని కృషి ఫలితంగా ఈ అరుదైన విజయాన్ని సాధించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా గీతిక ను స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం ఓబుల్ రెడ్డి, వెంకటనారాయణ, రామకృష్ణయ్య, కృష్ణారెడ్డి, మహేశ్వర రెడ్డి, సుబ్బారెడ్డి, శివగంగాధర్ రెడ్డి, రామాంజనేయులు మరియు స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షులు రాజు లు ఘనంగా సత్కరించి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ విలువైన సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, సేవాసమితి సభ్యులు చాంద్ బాషా, రాఘవేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు..

## 18న పెద్ది ట్రైలర్ విడుదల



రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది' ట్రైలర్ రిలీజ్ అప్‌డేట్ వచ్చేసింది. బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ క్రమంలో ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ ప్రచార కార్యక్రమాలు మొదలయ్యాయి. ఇందులో భాగంగా మే 18న 'పెద్ది' ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ప్రకటించింది. జాన్వీ కపూర్ ఈ సినిమాలో కథానాయికగా నటిస్తున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం బుచ్చిబాబు ఇటు ట్రైలర్‌ను సిద్ధం చేయడంతో పాటు, అటు మూవీ ఫైనల్ కట్‌ను కూడా రెడీ చేస్తున్నారట. సెన్సార్ ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే తగిన విధంగా చిత్ర బృందం ముందుకు సాగుతోంది. ప్రచార కార్యక్రమాలను కూడా భారీగా చేయాలని యోచిస్తున్నారు. రూ.300 కోట్ల భారీ బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రంలో కన్నడ నటుడు శివరాజ్‌కుమార్, దివ్యేందు, జగపతిబాబు, బొమన్ ఇరానీ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. శ్రుతిహాసన్ స్పెషల్ సాంగ్‌లో కనిపించనున్నట్లు సమాచారం.

## మే 21న 'దృశ్యం 3'




మోహన్ లాల్ నటించిన దృశ్యం 3 చిత్రం ఈ నెల 21న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. ఈసారి 'దృశ్యం 3' తెలుగులో రీమేక్ కావడం లేదు. వెంకటేష్ ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవడంతో, మోహన్‌లాల్ నటించిన ఒరిజినల్ మలయాళ వెర్షన్‌నే తెలుగులోకి డబ్ చేసి విడుదల చేయాలని మేకర్స్ నిర్ణయించారు. కేవలం తెలుగులోనే కాకుండా తమిళం, కన్నడ భాషల్లో కూడా డబ్బింగ్ వెర్షన్లు సిద్ధమ వుతున్నాయి. ఇప్పటికే కేరళతో పాటు ఓవర్సీస్ మార్కెట్లలో అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారం భమయ్యాయి. తెలుగు, ఇతర భాషల ట్రైలర్లు, విడుదల తేదీల గురించి ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మలయాళ వెర్షన్ విడుదలయ్యే రోజునే తెలుగు డబ్బింగ్ వెర్షన్ కూడా థియేటర్లలోకి వచ్చే అవకాశం ఉందని సమాచారం. మొదటి రెండు భాగాలు తెలుగు ప్రేక్షకులకు బాగా కనెక్ట్ కావడంతో, ఈ వెర్షన్‌కు కూడా టాలీవుడ్ లో మంచి ఆదరణ లభిస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## మాతృత్వం చాలా నేర్పింది!



"తల్లి అయిన తర్వాత నా జీవితం పూర్తిగా మారిపోయింది" అన్నారు కియారా అద్వానీ. తాజాగా ఆమె ప్రముఖ పాడ్‌కాస్ట్ హోస్ట్ రాజ్ షమానికు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రసవం తర్వాత తల్లి శరీరం, మానసిక స్థితిలో వచ్చే మార్పుల గురించి మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. 'పాప పుట్టిన తర్వాత మొదటి ఆరు నెలలు నరకం చూశా. నాపై నాకే జాలి చూపించుకోవడం కష్టంగా అనిపించింది. చిన్న చిన్న విషయాలకే ఏడ్చేదాన్ని. భావోద్వేగాలను కంట్రోల్ చేసుకోలేకపోయేదాన్ని. ఈ స్థితినిఅర్థం చేసుకోవడానికి ఆరు నెలల సమయం పట్టింది. ఇంతకాలం కుటుంబం, పని, ఇతరుల గురించి మాత్రమే ఆలోచించిన నేను.. నా కోసం కూడా సమయం కేటాయించుకోవాల్సిన అవసరం ఉందన్న విషయం మాతృత్వం నేర్పింది. ఈ కష్ట సమయంలో నా భర్త సిద్ధార్థ్ మల్హోత్రా చాలా సపోర్ట్ చేశాడు. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా, ప్రతి రోజు రాత్రి డ్రైవ్‌కు తీసుకెళ్లేవాడు. ఆ చిన్న డ్రైవ్స్ కూడా నాకు ఎంతో మానసిక ప్రశాంతతను కలిగించేవి' అంటూ కియారా వివరించారు. కియారా, సిద్ధార్థ్‌లది ప్రేమ వివాహం. 2023లో వీరి పెళ్లి జరిగింది. 2025 జులైలో వీరికి కుమార్తె జన్మించింది.



## శ్రేయస్, ప్రియాన్ష్ మెరుపులు..
## పంజాబ్ కింగ్స్ భారీ స్కోరు

**ఢిల్లీ క్యాపిటల్స్‌కు 211 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించిన పంజాబ్**

**అర్ధశతకాలతో చెలరేగిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ప్రియాన్ష్ ఆర్య**

**చివర్లో 8 బంతుల్లో 21 పరుగులు చేసిన సూర్యాంశ్ షెడ్గే**

**ఢిల్లీ బౌలర్లలో స్టార్క్, మాధవ్ తివారీలకు రెండేసి వికెట్లు**

**టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఢిల్లీకి నిరాశ**

**ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ బ్యాటర్లు పరుగుల వరద పారించారు. ధర్మశాల వేదికగా మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్, నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 210 పరుగుల భారీ స్కోరు సాధించింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (59లి), యువ ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య (56) అర్ధశతకాలతో చెలరేగారు.**

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ కింగ్స్‌కు ఓపెనర్లు ప్రియాన్ష్ ఆర్య, ప్రభ్‌సిమ్రాన్ సింగ్ అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చారు. ముఖ్యంగా ఆర్య కేవలం 33 బంతుల్లో 2 ఫోర్లు, 6 సిక్సర్లతో 56 పరుగులు చేసి ఢిల్లీ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. పవర్‌ప్లేలో పంజాబ్ 72 పరుగులు రాబట్టింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. కూపర్ కనోలీ (38)తో కలిసి స్కోరు బోర్డును నడిపించాడు. ఆఖరి ఓవర్లలో శ్రేయస్ తన విశ్వరూపం చూపించాడు. కేవలం 36 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 59 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అతనికి సూర్యాంశ్ షెడ్గే (8 బంతుల్లో 21లి) తోడవడంతో పంజాబ్ స్కోరు 200 దాటింది. ఢిల్లీ బౌలర్లలో మాధవ్ తివారీ, మిచెల్ స్టార్క్ చెరో రెండు వికెట్లు తీసినప్పటికీ, భారీగా పరుగులు సమర్పించుకున్నారు. ముఖేశ్ కుమార్ ఒక వికెట్ పడగొట్టాడు.



## భువీని టీమిండియాకు ఎంపిక చేయాలి : రవిచంద్రన్ అశ్విన్



**చెన్నై:** ఐపిఎల్ లో రాణిస్తున్న ఆర్సీబీ స్టార్ పేసర్ భువనేశ్వర్ కుమార్ ను జాతీయ జట్టుకు ఎంపిక చేయాలని మాజీ దిగ్గజ ఆటగాడు రవిచంద్రన్ అశ్విన్ డిమాండ్ చేశాడు. 2026 ఐపిఎల్ సీజన్‌లో భువీ అద్భుత ప్రదర్శనలు చేస్తున్నాడని, ఇప్పటి వరకు 11 మ్యాచ్‌లు ఆడి 21 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడని ఈ సందర్భంగా గుర్తు చేశాడు. పవర్ ప్లేలో, డెత్ ఓవర్లలో కీలకమైన వికెట్లు పడగొట్టి జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తుడని తెలిపాడు. ఆదివారం ముంబై ఇండియన్స్‌పై ఆర్సీబీ 2 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో భువీ నాలుగు వికెట్లతో చెలరేగాడు. ఛేజింగ్‌లో దాదాపు ఓటమి ఖాయమనుకున్న ధశలో భారీ సిక్సర్ బాది జట్టు విజయ సమీకరణాన్ని తేలిక చేశాడు. అటు బంతితోనే కాకుండా బ్యాట్‌తోనూ అదరగొడు తున్నాడని ఫామ్ లో ఉన్న భువి ఎంపికపై సెలెక్టర్లు దృష్టి సారించాలన్నాడు.

## ఫ్రాంచైజీపై బిసిసిఐ సీరియస్

**ఈసారి ఉల్లంఘనలు అతిక్రమిస్తే కఠిన చర్యలే..**

ముంబయి: ఐపిఎల్ ఫ్రాంఛైజీలకు బిసిసిఐ మరోసారి మార్గదర్శకాలను జారీ చేసింది. ఫ్రాంచైజీలు పదేపదే మార్గదర్శకాలను ఉల్లఘించడాన్ని బిసిసిఐ తీవ్రంగా పరిగణించింది. రూల్స్ ప్రకారం జట్ల యజమానులు మ్యాచ్‌ల సమయంలో డగౌట్‌కు దూరంగా ఉండాలని, ఆటగాళ్లు లేదా జట్టు సిబ్బందితో మాటల ద్వారా గానీ, చేతల ద్వారా గానీ ఎలాంటి సంప్రదింపులు జరపకూడదు. అయితే, కొందరు యజమానులు పలు సందర్భాల్లో ఈ నిబంధనలను ఉల్లంఘించినట్లు ఆరోపణలు రావడంపై బిసిసిఐ అసహనం వ్యక్తం చేసింది. ఇకపై ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. ఈ సీజన్‌లో కొన్ని అవాంఛనీయ ఘటనలు, ప్రోటోకాల్ ఉల్లంఘనలు బోర్డు అవినీతి నిరోధక విభాగం (ఏసీయూ) దృష్టికి వచ్చాయి. దీంతో అప్రమత్తమైన బీసీసీఐ కొన్ని నిబంధనలను రూపొందించి వెంటనే అమల్లోకి తెచ్చింది. ఆటగాళ్లు, సహాయక సిబ్బంది, జట్టు అధికారుల హోటల్ గదుల్లోకి అనధికార వ్యక్తులను నిషేధించింది. ఇక మీదట ఏ అతిథి అయినా ఆటగాళ్ల గదుల్లోకి వెళ్లాలంటే జట్టు మేనేజర్ నుంచి కచ్చితమైన లిఖితపూర్వక అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ మేరకు 10 ఫ్రాంచైజీల సిఇవోలకు బిసిసిఐ కార్యదర్శి దేవజిత్ సైకియా లేఖలు రాశారు.

# బివిఎస్ఆర్ ట్రాన్స్‌పోర్ట్ యజమానిని కలిసిన కడప ఎంపీ

**- నేషనల్ హైవే అధికారులతో సమస్యల పరిష్కారానికి ఎంపీ కృషి**
**- వైసీపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలి**




**తొండూరు – సూర్య వాస్తవం:** తొండూరు మండలం తేలూరు గ్రామంలో శ్రీరాముల దేవాలయం పున ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న ఎంపీ అవినాష్ రెడ్డిని సోమవారం బి వి.ఎస్.ఆర్ ట్రాన్స్పోర్ట్ యజమాని బివి సుబ్బారెడ్డి తన గ్యారేజ్ వద్ద ఎంపీ అవినాష్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్యారేజ్ లోని ఆయన కార్యాలయంలో ఎంపీ అవినాష్ రెడ్డిని దుశాల్వాతో సత్కరించి స్వామివారి విగ్రహాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జమ్మలమడుగు నుండి వస్తున్న నేషనల్ హైవే రోడ్డు తన గ్యారేజ్ వద్ద ట్రాన్స్పోర్ట్ లారీలు గ్యారేజీలోకి వచ్చేందుకు వీలు లేకుండా పూర్తిగా రోడ్డు వేసి సైదాపురం వద్ద మలుపు పెట్టడం జరిగిందని ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు. ఇక్కడే గ్యారేజీలకు లారీలు వచ్చేందుకు వీలుగా మలుపు పెట్టాలని ఆయనను కోరగా వెంటనే ఆయన నేషనల్ హైవే అధికారులతో శరవాణిలో వారికి సమస్యను తెలియజేసి ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులకు తెలిపారు. ఈ విషయం రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నకు తెలియజేయడం జరిగిందని ఆయన తెలిపారు. అందువల్ల ఈ విషయం పై స్పందించి లారీలు గ్యారేజ్ కు పోయే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సంబంధిత అధికారులు తో మాట్లాడారు . అనంతరం ఆయన బివి సుబ్బారెడ్డి తో పది నిమిషాల పాటు పలు సమస్యలపై చర్చించారు. 2029 ఎన్నికలలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా బివి సుబ్బారెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో మళ్లీ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకునేందుకు శక్తివంచన లేకుండా, పార్టీ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తామని ఎంపీ అవినాష్ రెడ్డికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా తన గ్యారేజ్కి ఎంపీ అవినాష్ రెడ్డి రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ తేలూరు మాజీ సర్పంచ్ రామ సుబ్బారెడ్డి, వైఎస్ఆర్సిపి నాయకులు చంద్ర ఓబుల్ రెడ్డి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. మన్మథ రెడ్డి,లక్ష్మిరెడ్డి ఇంద్ర కిరణ్ రెడ్డి, సుకుమార్ రెడ్డి, రాఘవరెడ్డి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ముత్యాల చెరువు గ్రామపంచాయతీలో
# నకిలీ పాసు పుస్తకాల కుంభకోణం..

**- పట్టాదార్ పాసు పుస్తకాల పంపిణీలో వైసీపీ నాయకుల హస్తం?**
**- రెవెన్యూ, పోలీస్ అధికారులకు బాధితుల ఫిర్యాదు..**



**కదిరి – సూర్య వాస్తవం :**
శ్రీ సత్యసాయి జిల్లా కదిరి మండలం ముత్యాల చెరువు గ్రామ పంచాయతీలో నకిలీ పట్టాదారు పాస్ పుస్తకాల కుంభకోణం వెలుగులోకి వచ్చింది. నకిలీ పట్టాదార్ పాసు పుస్తకాలకు సంబంధించిన వివరాలను బాధితులు గొల్లోల్ల చెరువు సింగిల్ విండో ప్రెసిడెంట్ నాగూర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో తహసిల్దార్ రెడ్డి శేఖర్ కు సోమవారం వివరించారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. నల్లగుట్ట తండాకు చెందిన బాధితులు భూక్య రామాంజులు నాయక్, దేవి భాయ్ అధికారులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇలా ఉన్నాయి. గత వైసిపి ప్రభుత్వం లో భూమి లేని నిరుపేదలకు భూ పంపిణీ చేస్తున్నారని మా గ్రామానికి చెందిన లక్ష్మీ నాయక్ రమణా నాయక్ కృష్ణా నాయక్ రవి నాయక్ చిగురుమను తండాకు చెందిన సేవే నాయక్ లు మీకు కూడా పట్టాదారు పాస్ పుస్తకాలను ఇప్పిస్తామని చెప్పి మా ఆధార్ కార్డు బియ్యం కార్డు జిరాక్స్ తీసుకొని వెళ్లారని చెప్పారు. ఈ పట్టాదారు పాస్ పుస్తకాలు రెవెన్యూ అధికారుల వద్ద ఇప్పించాలంటే డబ్బులు ఖర్చు అవుతాయని చెప్పడంతో తాము కూడా వారు అడిగినంత డబ్బులు ఇచ్చామని ఫిర్యాదులో పేర్కొన్నారు. వైసిపి నాయకులు రెండు లక్షలు తమను ఇవ్వమని అడిగారని అయితే తాము ఒకటిన్నర లక్ష రూపాయలకు ఒప్పందం కుదుర్చుకొని అడ్వాన్సుగా 40 వేల రూపాయలను ఇచ్చామని వివరించారు. రోజులు గడిచినప్పటికీ తమకు ఇంకా పట్టాదారు పాస్ పుస్తకాలు రాలేదని తాము వారిని గట్టిగా అడిగామని అయితే మీరు ఇచ్చినది కేవలం 40 వేల రూపాయలు మాత్రమే అని చెప్పారని పేర్కొన్నారు. ఒప్పందం ప్రకారం మిగిలిన డబ్బులు ఇస్తే తాము రెవెన్యూ అధికారులకు చెప్పి పట్టాదారు పాస్ పుస్తకాలను ఇప్పించగలమని చెప్పడంతో మిగిలిన డబ్బులు కూడా ఒక్కొక్కరం ఒకటిన్నర లక్ష రూపాయలను చెప్పిన మేరకు ఇచ్చామని బాధితులు వాపోయారు. అయినప్పటికీ తమకు పట్టాదార్ పాస్ పుస్తకాలు మాత్రం ఇవ్వలేదని తమకు అనుమానం వచ్చి అడుగుతున్నప్పటికీ వైసీపీ నాయకులు స్పందించకపోవడంతో తమకు అనుమానం వచ్చిందన్నారు. తాము గట్టిగా నిలదీయడంతో మూడు నెలల క్రితం పట్టాదారు పాస్ పుస్తకాలతో పాటు పట్టాలను కూడా ఇచ్చారని అయితే వాటిని ఆన్లైన్లో చూడగా నకిలీవిగా తమకు తేలిందని వాపోయారు. ఈ విషయం ఆలస్యంగా బాధితులకు తెలియడంతో కంగుతిన్న బాధితులు గొల్లోల చెరువు సింగల్ విండో ప్రెసిడెంట్ నాగూర్ శ్రీనివాస్ రెడ్డిని ఆశ్రయించడంతో ఆయన ఆధ్వర్యంలో తమకు న్యాయం చేయాలంటూ బాధితులు తహసిల్దార్ రెడ్డి శేఖర్, కదిరి అర్బన్ సిఐ నిరంజన్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. తాము విచారించి మీకు న్యాయం చేస్తామంటూ అధికారులు బాధితులకు భరోసా ఇచ్చారు.

# క్రింది స్థాయి నాయకుల అభిప్రాయాలను ఆలకించండి

**- అభిమాన నాయకునితో చిన్నపాటి సమావేశం వెయ్యి ఏనుగుల బలాన్ని అందిస్తుంది - టీడీపీ నేత వెంకట్రామిరెడ్డి విజ్ఞప్తి**



**పులివెందుల– సూర్య వాస్తవం :** సువిశాల తెలుగుదేశం పార్టీ కుటుంబంలోని క్రింది స్థాయి నాయకుల అభిప్రాయాలను ఆలకించే ప్రయత్నాలను పార్టీ అధినాయకులు నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో విరివిగా చేపట్టాలని, వారు నిర్వహించే చిన్నపాటి సమావేశం పార్టీ శ్రేణులకు వెయ్యి ఏనుగుల బలాన్ని అందిస్తుందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు పులివెందుల పట్టణ పార్టీ మాజీ అధ్యక్షుడు ఎం.వెంకట్రామిరెడ్డి పార్టీ అధిష్టానానికి ఒక ముఖ్యమైన విజ్ఞప్తి చేశారు. సోమవారం నరేంద్ర మోడీ పర్యటన సందర్భంగా తన అభిప్రాయాలను మీడియా ద్వారా పంచుకుంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నివాసానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విచ్చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూనే పార్టీ కార్యకర్తలు మరియు క్షేత్రస్థాయి నాయకుల ఆవేదనను ఆయన ఒక వీడియో సందేశం ద్వారా తెలియజేశారు.ప్రధాని మోదీ చంద్రబాబు నాయుడు నివాసానికి రావడం పట్ల కోట్లాది మంది టీడీపీ కార్యకర్తలు పండుగలా భావించారని వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు.ఇది టీడీపీ కుటుంబానికి దక్కిన అరుదైన గౌరవమని ఆయన కొనియాడారు.పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్నా,క్షేత్రస్థాయిలో కష్టపడిన సీనియర్ నాయకులను, కార్యకర్తలను అధిష్టానం పిలిచి మాట్లాడకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తమను పిలిచి మాట్లాడిన విషయాన్ని గుర్తు చేస్తూ ఇప్పుడు కూడా అదే ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కేవలం ఎన్నికల సమయంలోనే కాకుండా సాధారణ సమయంలో కూడా తమలాంటి హార్డ్ కోర్ వర్కర్ల అభిప్రాయాలను వినాలని, అలా చేస్తే సమాజంలో తమకు గౌరవం పెరుగుతుందని ఆయన అన్నారు.కేవలం ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలతోనే కాకుండా,ప్రతి నియోజకవర్గం నుండి 30-40 మంది సీనియర్ నాయకులను పిలిపించి మాట్లాడాలని చంద్రబాబు నాయుడు,నారా లోకేష్ మరియు రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావులకు విజ్ఞప్తి చేశారు.అధినేతతో మాట్లాడటం తమకు వెయ్యి ఏనుగుల బలాన్ని ఇస్తుందని, పద వుల కంటే గుర్తింపు ముఖ్యమని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. శ్రీకాకుళం నుండి చిత్తూరు వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న టీడీపీ కార్యకర్తల మనోగతాన్ని తాను వినిపిస్తున్నానని వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు.

# అంగవైకల్యాన్ని జయించి ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన విద్యార్థులు

**- ఏపీ సమగ్ర శిక్ష అమరావతి ఆధ్వర్యంలో అరుదైన ఘనత**
**- పసల ప్రసాద్‌కు కలెక్టర్ అభినందనలు**



**శ్రీ సత్య సాయి బ్యూరో – సూర్య వాస్తవం:** ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించడంలో అంగవైకల్యాన్ని జయించారు విద్యార్థులు. వీరిని శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ సోమవారం ఘనంగా సత్కరించారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఏపీ సమగ్ర శిక్ష అమరావతి ఆధ్వర్యంలో నిర్వహించిన అడ్వెంచర్ స్పోర్ట్స్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది జోన్ల నుండి మొత్తం 919 మంది అంగవైకల్యంతో కూడిన విద్యార్థులను ఎంపిక చేశారు. వీరిలో 70 మందిని తుది ఎంపిక చేయగా, అందులో 25 మంది విద్యార్థులను ప్రత్యేక శిక్షణ కోసం ఎంపిక చేసి మౌంట్ ఎవరెస్ట్ అధిరోహణకు పంపించారు. ఈ బృందం ఏప్రిల్ 15న యాత్రను ప్రారంభించి, ఏప్రిల్ 25న ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌కు చేరుకొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సుమారు 5364 మీటర్ల ఎత్తు వరకు చేరుకొని దేశభక్తిని చాటారు. అనంతరం ఏప్రిల్ 30న సురక్షితంగా తిరిగి వచ్చారు. శారీరక లోపాలను, అంగవైకల్యాన్ని అధిగమించి ఈ అరుదైన ఘనత సాధించిన విద్యార్థులు అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ మార్గదర్శకత్వంలో, ఎస్పీడీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో విజయవంతంగా నిర్వహించారు. ఇదే సందర్భంలో శ్రీ సత్యసాయి జిల్లా తనకల్లు మండలానికి చెందిన విద్యార్థి పసల ప్రసాద్ ను జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ శాలువా కప్పి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కిష్టప్ప, స్పోర్ట్స్ కన్సల్టెంట్ కడపల శంకర్, జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్పీ పుల్లన్న, సమగ్ర శిక్ష అభియాన్ ఐఆర్పీలు మురళి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# బైకును ఢీకొన్న బొలెరో వాహనం..

**- యువకుడు మృతి**



**పులివెందుల క్రైమ్ – సూర్య వాస్తవం :** పులివెందుల కదిరి రోడ్డులో ఎస్సీ ఎస్సార్ ఫంక్షన్ హాల్ సమీ పంలో ద్విచక్ర వాహనాన్ని అరటికాయల బొలెరో వాహనం ఢీకొనడంతో గిద్దలూరు భరత్ (20 )అనే యువకుడు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది .పోలీసుల కథనం మేరకు వెలమవారిపల్లెకు చెందిన గిద్దలూరు భరత్, పులివెందుల ఇస్లాంపురం కు చెందిన ఆసిఫ్ లు ఏపీ 40 కే డబ్ల్యూ 9793 ద్విచక్ర వాహనంలో వెలమవారిపల్లెకు వెళుతుండగా కదిరి రోడ్డు ఎస్సీ ఎస్సార్ కళ్యాణమండపం సమీపంలో ఉన్న కాలువ వద్దకు రాగానే కదిరి వైపు నుంచి పులివెందుల వైపుకు అతి వేగంగా వస్తున్న ఏపీ 39 యు ఎం 2011 నంబరుగల బొలెరో వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో భరత్‌కు తలకు తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనం నుజ్జునుజ్జయింది. ఈ విషయం గమనించిన స్థానికులు గాయపడిన యువకులను ప్రైవేటు ఆసుపత్రికి తరలిం చారు. భరత్ ను పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు.ఈ ప్రమాదంలో ఆసిఫ్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. యువకుడి మృతితో వెలమవారిపల్లెలో విషాదం చోటుచేసుకుంది. మృతి చెందిన భరత్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.భరత్ సోదరుడు శివ శశాంక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**యువకుడి ప్రాణం తీసిన బొలెరో అతివేగం**

బొలెరో వాహనం డ్రైవర్ అతి వేగంగా నడపడం వల్లనే భరత్ అనే యువకుడు మృతి చెందినట్లు స్థానికులు చెబుతున్నారు. అతివేగం ప్రమాదకరమని ట్రాఫిక్ పోలీ సులు, అధికారులు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించినప్పటికీ అతివేగంతో వాహనాలు నడపడం వల్ల ఎన్నో ప్రమాదాలు గాలిలో కలిసి పోతున్నాయి. అతి వేగంగా నడిపే వాహనదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# రాయలసీమకు రాయల్ ఎన్ఫీల్డ్ సంస్థ రాక

**- మడకశిరలో బుల్లెట్ ర్యాలీ**

**మడకశిర – సూర్య వాస్తవం :** రాయలసీమ పారిశ్రామికాభివృద్ధిలో ఇదొక కీలక పరిణామం. రాయల్ ఎన్ఫీల్డ్ సంస్థను ఈ ప్రాంతానికి తీసుకురావడం ద్వారా స్థానిక యువతకు పెద్దపీట వేయడం అభినందనీయం. మడకశిరలో జరిగిన బైక్ ర్యాలీలో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు స్వయంగా బుల్లెట్ వాహనాన్ని నడుపుతూ ఈ ర్యాలీని ముందుండి నడిపించారు. సుమారు రూ.2,200 కోట్ల భారీ పెట్టుబడితో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుంది. ఈ పరిశ్రమ ద్వారా వందలాది మంది యువతకు ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. ఆటోమొబైల్ రంగంలో దిగ్గజ సంస్థ అయిన రాయల్ ఎన్ఫీల్డ్ రాకతో రాయలసీమ ముఖచిత్రం మారడమే కాకుండా, అనుబంధ పరిశ్రమలు కూడా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. గతంలో కియా మోటార్స్ రాకతో అనంతపురం జిల్లా ఆటోమొబైల్ హబ్‌గా మారగా, ఇప్పుడు రాయల్ ఎన్ఫీల్డ్ రాకతో ఆ పారిశ్రామిక ప్రస్థానం మరింత వేగం పుంజుకోనుంది.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9948461699 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad )


# రాజకీయ రక్షణలో పేట్రేగిపోతున్న డ్రగ్ నెట్‌వర్క్

**- డా. ముచ్చుకోట సురేష్ బాబు**

భారతదేశం మొత్తం చోటుచేసుకుంటున్న ఒక రకమైన హై-ప్రొఫైల్ నార్కోటిక్స్ కేసుల సిరీస్ మళ్లీ రాజకీయ, ప్రభావం డ్రగ్ నెట్‌వర్క్‌ల మధ్య సంబంధంపై తీవ్రమైన ప్రశ్నలను ఏర్పరుస్తోంది. మధ్యప్రదేశ్ నుండి తెలంగాణ వరకు, రాజకీయులు, వారి అనుబంధులు మరియు ప్రభావవంతుల కుటుంబాలు పాల్గొన్న అనేక కేసులు, శక్తివంతమైన వ్యక్తులు బాధ్యత నుంచి తప్పించుకోవడంతో కేవలం ఛోటా నేరస్తులు మాత్రమే దర్యాప్తు కేంద్రంగా మారడం అనే ఆరోపణలను ప్రేరేపించాయి. ఇటీవల ఈగల్ బృందం దాడులు, రైడ్లు, అరెస్టులు సెన్సేషనల్ ఆరోపణలు ప్రజా గమనాన్ని మరింత ఉద్దేశ్యపూర్వకంగా చేశారు, ముఖ్యంగా తెలంగాణ, కర్ణాటకలో నార్కోటిక్స్ దర్యాప్తులు రాజకీయ, సినీ, ఎలైట్ సామాజిక వర్గాలకు సంబంధించిన సంబంధాలను బయటపెట్టాయి.

తెలంగాణ ఫార్మ్‌హౌస్ రైడ్ రాజకీయ తుఫాను హైదరాబాద్ పరిధిలోని మోయినాబాద్‌లో మాజీ బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫార్మ్‌హౌస్‌పై తెలంగాణ పోలీస్ బృందం చేపట్టిన రైడ్ ఒక పెద్ద రాజకీయ వివాదాన్ని రేకెత్తించింది.

వ్యక్తిగత సమావేశంలో నార్కోటిక్స్ వినియోగం జరుగుతున్నట్లు ఇంటెలిజెన్స్ సమాచారం అందుకున్న పోలీసులు, రైడ్ నిర్వహించారు. అధికారులు చెప్పినట్లుగా, ప్రాంగణ ప్రవేశంలో అవరోధం ఎదుర్కొని, గన్‌షాట్లు వినిపించాయి. పార్టీ లోపల ఉన్న పది మందిలో , ఆంధ్రప్రదేశ్ టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్, తెలంగాణ, రాజస్థాన్ మాజీ ఎమ్మెల్యేలు ఉన్నారు, పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. ఫార్మ్‌హౌస్ నుండి సుమారు రెండు గ్రాముల కోకైన్ మరియు అనుమానాస్పద నార్కోటిక్ పదార్థాల శేషాలు రికవర్ అయ్యాయి. డ్రగ్ టెస్టులు రోహిత్ రెడ్డీ సహా కొన్ని పాల్గొన్నవారికి పాజిటివ్ అని చెప్పారు. అయితే, టీడీపీ ఎంపీ నెగటివ్ అని నిర్ధారించబడ్డారు, తదుపరి టెస్టులో ఆయనకు పాజిటివ్ వచ్చింది. తర్వాత నోటీసులు జారీ చేసి స్టేషన్ బెయిల్ మంజూరు చేశారు. చర్చలలో ఉన్న పార్లమెంట్ సెషన్ కారణంగా అధికారులు ఈ చర్యను తీసుకున్నారని తెలిపారు. మాధ్యమాల దృష్టిని తప్పించేందుకు ఆయన నిశ్శబ్దంగా వెనుక ద్వారం ద్వారా తరలించబడ్డారు. ఈ ఘటన రాజకీయంగా



సున్నితమైనది, ఎందుకంటే 2024లో శాసనసభలో తిరిగి అధికారంలోకి వచ్చిన ఆంధ్రప్రదేశ్ తెలుగు దేశం "సే నో టు డ్రగ్స్" కృషి ద్వారా డ్రగ్ దాడులపై గట్టి ప్రచారం చేసింది, గత ప్రభుత్వంపై నార్కోటిక్స్ విస్తరించినట్లు ఆరోపణలు చేశారు.


బండి సంజయ్ కుమా రుడిపై పోస్కో కేసుకేంద్ర గృహ శాఖ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగిరథ్ పై 17 ఏళ్ల అమ్మాయి చేసిన ఫిర్యాదు ప్రకారం పోస్కో చట్టం కింద కేసు నమోదు అయిన కేసు వివాదం మరింత తీవ్రంగా మారింది. ఫిర్యాదు ప్రకారం, భగిరథ్ ఆమెను పార్టీలకు ఆహ్వానించి, తర్వాత హైదరాబాద్ మోయినాబాద్‌లోని ఫార్మ్‌హౌస్‌కు తీసుకెళ్లి, అక్కడ ఆమెకు డ్రగ్స్ ఇచ్చి లైంగికంగా దాడి చేసినట్లు అమ్మాయి ఆరోపించింది. ఈ సంఘటన తర్వాత ఆ అమ్మాయి తీవ్ర మానసిక ఆందోళనకు గురై, రెండు సార్లు ఆత్మహత్య ప్రయత్నాలు చేసిందని కుటుంబం తెలిపింది. పోలీసులు, కుటుంబం మరియు సామాజిక ఆందోళనల ప్రభావంతో, పోస్కో చట్టం ఇతర సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ ఆరోపణలు సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా చేరడంతో తెలంగాణలో తీవ్ర రాజకీయ చర్చ మొదలైంది.

హైదరాబాద్ ప్రధాన నార్కోటిక్స్ హబ్‌గా నిపుణులు, రీహాబిలిటేషన్ వర్కర్లు చెబుతున్నట్లుగా, హైదరాబాద్ త్వరితమైన నగరీకరణ, పెరుగుతున్న ఆదాయం, నైట్‌లైఫ్ కల్చర్, డ్రగ్స్ సులభంగా అందుబాటులో ఉండడం వలన మందు వినియోగానికి తగిన వాతావరణంగా మారింది. హైదరాబాద్‌లో డ్రగ్ వినియోగ నమూనాలను పరిశీలించిన పరిశోధకులు, ఈ సమస్య "మహామారి" స్థాయికి చేరిందని, ముఖ్యంగా యువత, సమృద్ధిగా ఉన్న సామాజిక వర్గాలలో అధికంగా ఉంది అని పేర్కొన్నారు. మాదక ద్రవ్య సమస్యను కేవలం నేర సమస్యగా చూడరాదు, సామాజిక, మానసిక, ఆర్థిక మరియు సాంస్కృతిక నేపథ్యాలతో కూడా అర్థం చేసుకోవాలి. ఒత్తిడి మరియు ఆశయాల ఒత్తిడులు ప్రధాన కారణాలు అని అధ్యయనాలు చూపుతున్నాయి. రీహాబిలిటేషన్ మౌలిక సదుపాయాలు, ముఖ్యంగా ఆర్థికంగా బలహీన వర్గాల కోసం, సరిపడడం లేదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**రాజకీయ పార్టీల ముసుగులో తప్పించుకోవడం**

తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ మరియు పంజాబ్‌లోని ఇటీవలి వివాదాలు మళ్లీ పునరావృతమయ్యే జాతీయ నమూనాకు సంకేతం ఇస్తున్నాయి -- రాజకీయ ప్రభావవంతులైన వ్యక్తులు, ఎలైట్ నెట్‌వర్క్‌లు సన్నిహిత వ్యక్తులు డ్రగ్ కేసుల్లో బాధ్యత నుండి తప్పించుకోవడం సాధారణం అని ఆరోపణలు.

రాజకీయ పార్టీలు విభిన్న రాష్ట్రాల్లో యాంటీ-డ్రగ్ ప్రచారాలు, అవగాహన కార్యక్రమాలు ప్రారంభించినప్పటికీ, ఉన్నత-ప్రొఫైల్ నిందితులు ప్రత్యేక ప్రవర్తన, ఆలస్యం, లేదా సంస్థాత్మక రక్షణ పొందుతున్నట్లు కనిపించటం వల్ల దర్యాప్తు ప్రశ్నర్థకం అవుతుంది. ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో దర్యాప్తులు కొనసాగుతున్నందున, రాజకీయాలు, నార్కోటిక్స్, సినీ సాంస్కృతికం మరియు లా ఎన్ఫోర్స్‌మెంట్‌ల పెరుగుతున్న సమ్మేళనం, భారతదేశంలో ప్రజా చర్చల కేంద్రంగా కొనసాగుతుంది




# హజ్ యాత్రకు పయనమవుతున్న మునీర్ అహ్మద్‌కు ఘన సత్కారం



**విజయవాడ ప్రతినిధి- సూర్యవాస్తవం :** పవిత్రమైన మక్కా హజ్ యాత్రకు బయలుదేరుతున్న ఆంధ్రప్రదేశ్ ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ వైయస్సార్సీపి మైనారిటీ సీనియర్ నాయ కులు మునీర్ అహ్మద్‌ని లబ్బీపేటలోని వారి కార్యాలయంలో తూర్పు నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షుడు షేక్ సుభాని ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీ నాయకులు, మత పెద్దలు, సామాజిక కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పిపుష్పగుచ్ఛాలు అందించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైఎస్ఆర్సిపి కార్యదర్శి మైనారిటీ బాజీ బాబా మాట్లాడుతూ పవిత్రమైన మక్కా హజ్ యాత్ర ప్రతి ముస్లిం జీవి తంలో అత్యంత విశిష్టమైనదని తెలిపారు. ఇస్లాం ధర్మంలోని ఐదు ప్రధాన స్తంభాలలో హజ్ యాత్ర ఒక ముఖ్యమైన ఆధ్యాత్మిక కర్తవ్యమని పేర్కొన్నారు. అల్లాహ్ పిలుపు వచ్చిన వారికే ఈ అదృష్టం లభిస్తుందని, మక్కా మదీనా పవిత్ర స్థలాలను దర్శించడం ఎంతో భాగ్యమని అన్నారు.

వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పెనమలూరు నియోజకవర్గ అబ్జర్వర్. మీరు హుస్సేన్ మాట్లాడుతూ హజ్ యాత్ర మనిషిలో ఆత్మశుద్ధి,సహనం, సమానత్వ భావనలను పెంపొందిస్తుందని, ప్రపంచ నలుమూలల నుండి వచ్చే ముస్లింలు ఒకే వేదికపై ప్రార్థనలు చేయడం ఇస్లాం సౌభ్రాతృత్వానికి నిదర్శనమని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ అధ్యక్షుడు షేక్ మస్తాన్ మాట్లాడుతూ. యాత్ర విజయవంతంగా పూర్తిచేసుకుని క్షేమంగా తిరిగి రావాలని, రాష్ట్ర ప్రజల శాంతి, సౌభాగ్యం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేయాలని మునీర్ అహ్మద్‌ని కోరారు.

మునీర్ అహ్మద్ మాట్లాడుతూ తనకు ఈ పవిత్ర హజ్ యాత్ర చేసే అవకాశం కల్పించిన అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఆశీస్సులు అందించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తూ, దేశం రాష్ట్ర ప్రజల శాంతి, అభివృద్ధి కోసం మక్కా మదీనాలలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తానని చెప్పారు.

ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది ముక్తార్ అలీ, వైయస్సార్ ఎన్టీఆర్ జిల్లా మైనారిటీ ఉపాధ్యక్షుడు షేక్ ఉస్మాన్. మైనారిటీ నాయకులు బినియాషేక్. శంషుతదితరులు పాల్గొన్నారు.

# శభాష్ అనిల్ కుమార్

**- పీ4 కార్యక్రమంలో 233 కుటుంబాలను దత్తత తీసుకున్న డిస్కవర్ అనంతపురం వ్యవస్థాపకుడు ఏ జీ అనిల్ కుమార్**



**అనంతపురం - సూర్య వాస్తవం :** ఏ జి అనిల్ కుమార్ ఆధ్వర్యంలోని డిస్కావర్ అనంతపురం సంస్థ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన పీ4 కార్యక్రమంలో భాగంగా 233 "బంగారు కుటుంబాలను" దత్తత తీసుకుంది. ఈ సందర్భంగా మాట్లాడిన అనిల్ కుమార్, కుటుంబాలకు కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా, దీర్ఘకాలిక మార్గదర్శకత్వం,ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కుటుంబ సభ్యుల అభివృద్ధి కోసం పలు సామాజిక, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయనున్నట్లు వెల్లడించారు. సమాజ అభివృద్ధి అంటే కేవలం సహాయం ఇవ్వడం కాదు... వారిని స్వయం సమృద్ధి దిశగా నడిపించడం. ప్రతి కుటుంబ సభ్యుడు ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లేలా మేము అండగా నిలుస్తాం," అని అనిల్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బాలికలకు విద్యాభివృద్ధి కోసం సైకిళ్లు, మహిళలకు స్వయం ఉపాధి కోసం కుట్టు మిషన్లు, చిన్న వ్యాపారులకు పుష్ కార్టు అందించనున్నట్లు తెలిపారు. యువతకు కంప్యూటర్ శిక్షణ, ఫోటోగ్రఫీ ట్రైనింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్ మరియు వివిధ నైపుణ్యాభివృద్ధి శిక్షణలు ఇవ్వనున్నట్లు చెప్పారు. అదేవిధంగా, ఈ కుటుంబాల యువతకు ప్రత్యేకంగా మెంటరింగ్ కార్యక్రమాలు నిర్వహించి, వారి వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు మరియు ఉపాధి అవకాశాల పెంపుపై దృష్టి సారించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక ప్రజలు మరియు సామాజిక సంస్థలు అభినందించాయి. ప్రజల భాగస్వామ్యంతో సమాజ అభివృద్ధికి ఇది మంచి ఉదాహరణగా నిలుస్తుందని పేర్కొన్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన పీ4 కార్యక్రమం ద్వారా సామాజిక బాధ్యతతో వ్యక్తులు, సంస్థలు ముందుకు వచ్చి ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలవాలని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.

# గ్రీవెన్స్ డేలో ప్రజా సమస్యలపై స్పందించిన అధికారులు

**- తహసిల్దార్ కార్యాలయంలో వినతుల స్వీకరణ**
**- రెవెన్యూ విభాగానికి 11 దరఖాస్తులు**



**నాయుడుపేట- సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా నాయుడుపేట మండలం తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వ హించిన పీజీఆర్ఎస్ (గ్రీవెన్స్ డే) కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతులను అధికారులు స్వీకరించారు. ప్రజా సమ స్యలను వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ కార్య క్రమంలో తహసిల్దార్ జి. యువరాజ్ ప్రజల నుంచి నేరుగా దరఖాస్తులను స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భూ వివాదాలు, పట్టాదారు పాస్ పుస్తకాలు, ఆదాయ, నివాస ధ్రువపత్రాలు, భూ రికార్డుల సవరణలు తదితర అంశాలపై ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా రెవెన్యూ శాఖకు సంబంధించిన మొత్తం 11 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ఉండకూడదని, ప్రతి దరఖాస్తును పరిశీలించి అర్హత మేరకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని తహసిల్దార్ యువరాజ్ సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఒకే వేదికపై సమస్యల పరిష్కారం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట మండలం ఇంచార్జ్ ఎంపీడీవో ప్రమీలరాణి, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, వెటర్నరీ డాక్టర్ గోవర్ధన్ రెడ్డి, అగ్రికల్చర్ ఏవో గణేష్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అధికారులకు వినిపించారు.

# మిట్టమల్లేశ్వరునికి విశేష పూజలు



**పులివెందుల- సూర్య వాస్తవం:** పులివెందుల పట్టణ లోని గుంత బజార్ సమీపంలో ఉన్న ఎంతో పురా తనమైన ప్రసిద్ధిగాంచిన శ్రీ మిట్ట మల్లేశ్వర స్వామి ఆలయంలో సోమవారాన్ని పురస్క రించుకొని శ్రీ మిట్టమ ల్లేశ్వరుని విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా తెల్లవారుజామున నుం డి స్వామి వారికి ప్రధాన అర్చకులు రుద్ర, శివ స్వాముల ఆధ్వ ర్యంలో స్వామివారికి పంచా మృత అభిషేకం, భస్మాభిషేకం, సహస్ర నామ అష్టోత్తర శతనామావళి, భీష్మాభిషేకం, లిం గా ష్టకం తదితర పూజా కైకర్యాల అనంతరం మిట్ట మల్లేశ్వరుడు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శ నమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహకులు మాట్లాడుతూ శివాలయం లో ప్రతిరోజు విశేష పూజలు ధూప, దీప, నైవేద్యాలు, ఘనం గా నిర్వహించడం జరు గుతోందని అన్నారు. సోమవారాన్ని పురస్కరిం చుకొని ఆలయానికి పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని పరమశివునికి ఎంతో నమ్మకంతో భక్తి శ్రద్ధలతో మొక్కలు చెల్లించి విశేష పూజలు నిర్వ హించడం జరుగుతుందన్నారు. అనంతరం అనంతరం ఆలయ నిర్వా హకులు ఏర్పాటుచేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అంద జేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు ఎండొ మెంట్ సిబ్బంది ఆలయ నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.